
ప్రజలే ప్రభువులు

# జనబలం

జనవరి 2023 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-




## FDR/లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం





## సుపరిపాలన - ప్రజాస్వామ్యం - సంస్కరణలు



## అమృతకాలం- యువ భారతం

## ఓటు విలువ తెలిసే వ్యవస్థను నిర్మించుకోవాలి


విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, ఎంటర్ ప్రెన్యూర్లు, మహిళలు, మార్పు కోరుకుంటున్న పౌరులు..
జయప్రకాశ్ నారాయణ్ గారిని మీరే ప్రశ్నలు అడిగే అవకాశం
YouTube
www.youtube.com/@JPLoksattaOfficial
#Ask JP
వారం వారం ప్రతి శనివారం 4.00 P.M.
JP LOKSATTA YOUTUBE లో ప్రతి ఎపిసోడ్ చూడండి
JP ని మీ ప్రశ్నలు అడగటానికి ఈ QR CODE ద్వారా
రిజిస్టర్ అవ్వండి

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 01

జనవరి 2023


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




నిజమే.. మనకి కూడా మంచిదే. విడివిడిగా కాకుండా జమిలిగా ఓట్లను కొనేయవచ్చు!!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఒత్తిళ్లతో తడబడుతున్న ప్రజారోగ్య సేవలు

ఐరాస ప్రకటించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఆరోగ్య సంరక్షణ అత్యంత కీలకమైనది. ఆరోగ్యరంగంలో సాధించాల్సిన లక్ష్యాల గురించి అంతర్జాతీయ సమాజం ఇప్పటికే చాలా చర్చ చేసింది. అందరికీ వైద్య, ఆరోగ్య సేవలను అందుబాటులోనికి తేవడం, ప్రసవం సందర్భంగా సంభవించే తల్లీ, బిడ్డల మరణాలను, ఐదేళ్లలోపు చంటి బిడ్డల మరణాలను నివారించడం, సాంక్రమిక వ్యాధులను మహమ్మారులను అంతం చేయడం, అసాంక్రమిక వ్యాధుల కారణంగా సంభవించే మరణాలను తగ్గించడం, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, మాదకద్రవ్యాలు, మద్యం, పొగాకు వంటి హానికారక పదార్థాల వినియోగాన్ని నిరోధించడం, రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించడం, లైంగిక వ్యాధుల నివారణ, సంతాన సాఫల్యతా సంరక్షణ, హానికర రసాయనాల వల్ల జరిగే మరణాలను తగ్గించడం, వ్యాక్సిన్లను, మందులను అందుబాటు ధరలకు సరఫరా చేయడం వంటి అనేక ఆరోగ్య సంబంధ అంశాలపై గట్టిగా దృష్టి సారించాలని ఎస్.డి.జి విధాన ప్రకటన పేర్కొన్నది.

ఆర్థిక–సాంఘిక అసమానతలు విస్తృతం కావడం, పెరిగిపోతున్న నగరీకరణ, ధ్వంసమవుతున్న పర్యావరణం, వాతావరణ సంక్షోభం కారణంగా ప్రజారోగ్యం తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నది. జీవనశైలి వ్యాధులు, అసాంక్రమిక వ్యాధులు, కరోనా మహమ్మారి వంటి వైరస్‌ల విజృంభణ, మన ఆరోగ్య సంరక్షణా విధానాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి.

గుండెజబ్బులు, శ్వాసకోశవ్యాధులు, మధుమేహం, క్యాన్సర్ వంటి కారణాలతో ప్రతి రెండు సెకన్లకు ఒకరు మరణిస్తున్నారని, **39–70** ఏళ్ల వయోవర్గంలో ఈ మరణాలు పెరుగుతున్నాయనీ ప్రపంచ ఆరోగ్య నివేదిక వెల్లడించింది. పుట్టిన తొలి నెలలోనే మృత్యువాత పడిన నవజాత శిశువుల సంఖ్య **2019**లో **24** లక్షలుగా ఉందని పేర్కొన్నది. ప్రతీ వెయ్యి జననాలకు నవజాత శిశు మరణాలు **78**కాగా, దానిని **41**కి తగ్గించగలిగాం. కానీ **2030** నాటికి ఆ సంఖ్యను **25** కంటే తక్కువగా ఉండేటట్లు చూడాలని ఐరాస లక్ష్య నిర్దేశనం చేసింది. ప్రసూతి మరణాలను కూడా లక్షకు **70** కంటే తక్కువగా చేయాలని ఆదేశించింది. గత ఏడేళ్లలో ఈ రంగంలో సాధించిన కొద్దిపాటి ఫలితాలను కరోనా మహమ్మారి దెబ్బతీసింది. గత మూడేళ్లుగా కరోనా అనంతర ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పలు నివేదికలు ఆందోళన వెలిబుచ్చాయి. భారతదేశంలో పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీ లేదు. మన ఆరోగ్య వ్యవస్థలో ప్రాథమిక స్థాయి ఆరోగ్య సేవలు చాలా బలహీనంగా ఉన్నాయి. ప్రతి వెయ్యి మంది ప్రజలకూ **2.5** మంది వైద్యులు ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణం అమలు కావడం లేదు. మనదేశంలో వెయ్యి మంది జనాభాకి **0.7** డాక్టర్లు మాత్రమే ఉన్నారు. అందులో **7.8** శాతం వైద్యులు నగరాల్లోనే ఉన్నారు. రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆస్పత్రులు, మౌలిక సదుపాయాల అందుబాటులో తీవ్రమైన అసమానతలు ఉన్నాయి. ఎంతో కొంత అభివృద్ధి చెందిందనుకునే తమిళనాడులో **39**శాతం సిబ్బంది కొరత ఉంది. **60** శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్క డాక్టరే ఉన్నారు. **33** శాతం కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్, **20** శాతం కేంద్రాల్లో ఫార్మాసిస్ట్ లేరు. ఒడిశా వంటి రాష్ట్రాలలో **50** శాతం వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు జి.డి.పి.లో **1.2** శాతం మాత్రమే ఉంటూ వచ్చాయి. ఇటీవల దీనిని **1.8**శాతానికి పెంచారు. అయితే కనీసం **2.5** శాతం కేటాయిస్తే ప్రాథమిక, ద్వితీయ స్థాయి సేవలను మెరుగుపరచవచ్చునని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కరోనా మహమ్మారి విరుచుకుపడినప్పుడు వచ్చి పడిన పని భారాన్ని తట్టుకుని నిలబడగలిగే యంత్రాంగం మనకు లేదని కరోనా అనుభవం చాటి చెప్పింది. ప్రైవేటు సేవల యంత్రాంగం కూడా తొట్రుబాటుకు గురయ్యింది. మనదేశంలో దాదాపు **70**శాతం తృతీయ స్థాయి వైద్య సేవలు ప్రైవేటు రంగంపైనే ఆధారపడి కొనసాగుతున్నాయి. వైద్యం కోసం చేసే వ్యయంలో **70** శాతం ప్రైవేటు రంగానికే చేరుతున్నది. ప్రజలు సొంత జేబు నుంచి తీసి ఖర్చు చేస్తున్న సొమ్ము మొత్తం వ్యయంలో **61**శాతంగా ఉన్నది. వైద్య ఖర్చులు భరించలేక ఏటా ఆరున్నర కోట్ల మంది దారిద్ర్య రేఖ దిగువకు జారిపోతున్నారు. శ్రీలంక, థాయ్‌లాండ్, చైనా వంటి దేశాలతో పోలిస్తే వైద్య సంరక్షణ సేవల్లో మనదేశం వెనుకంజలో ఉందని చెప్పక తప్పదు.

**2002** నాటి జాతీయ ఆరోగ్య విధానం మన జీడీపీలో మూడు శాతం సొమ్మును ప్రభుత్వం ఖర్చు చేయాలని చెప్పింది. **2017** నాటి జాతీయ ఆరోగ్య విధానం **2025** నాటికి మన వ్యయాన్ని జీడీపీలో **2.5** అయినా ఉండేటట్లు చూడాలని చెప్పింది. జాతీయ ఆరోగ్య మిషన్ వ్యయం **2006** నాటికి **76**శాతంగా ఉండగా **2019** నాటికి దానిని **50** శాతానికి కుదించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టి ఐదేళ్లు కావస్తున్నా వాటి అమలు ఇప్పటికీ పూర్తిగా ప్రారంభం కాలేదు. భారతదేశం తన మూడంచెల వైద్య, ఆరోగ్య సేవల యంత్రాంగాన్ని పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఎఫ్.డీ.ఆర్/లోక్‌సత్తా ప్రతిపాదించిన ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ ప్రాథమిక స్థాయి సేవలను పటిష్టం చేస్తుందని, నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రభుత్వ రంగ–ప్రైవేటు–వ్యక్తిగతమైన భాగస్వామ్యాన్ని అనుమతించి ఒక సమగ్ర దృక్పథంతో కార్యాచరణ చేపడితే ఫలితాలు సాధించవచ్చు. ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీలో **2.5**గా పెంచితే చాలా వరకూ సమస్యలు పరిష్కారం అవుతాయి. జనరిక్ మందులను, జన్‌ఔషధి కేంద్రాల సంఖ్యను పెంచి ప్రజలకు అందుబాటు ధరల్లో మందులను సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. సమాచార సాంకేతికతను మరింతగా విస్తరించి ప్రజలందరికీ వైద్య, ఆరోగ్య సేవలను విస్తరింపచేయాలి. అల్లోపతిక్ సేవల సామర్థ్యాన్ని వినియోగించుకుంటూనే, దానిపై ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా ఆయుష్ సేవలని వినియోగించే రంగాలను ఎంచుకుని పనిచేయించాలి. అర్బన్ ఆరోగ్య కేంద్రాలను, అర్బన్ సబ్–సెంటర్లను పనిచేయించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలి. వైద్య, ఆరోగ్య రంగంలో తక్కువ ఖర్చుతో తయారయ్యే ఉపకరణాల కోసం నూతన ఆవిష్కరణలని, పరిశోధనలను ప్రోత్సహించాలి. **2030** నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే వైద్య, ఆరోగ్య రంగంపై కేంద్రీకరించాలి.

డి. సోమసుందర్

# సుపరిపాలన - ప్రజాస్వామ్యం - సంస్కరణలు

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**



2014 వ సంవత్సరం నుండి అటల్ బిహారి వాజపాయి జన్మదినమయిన డిశంబరు 25 తేదీని సుపరిపాలనా దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించి, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సంబరాలలో భాగంగా పది పాలనా రంగాలలో 58 సూచికలని గుర్తించి సుపరిపాలన అందించిన అధికారులని సత్కరిస్తోంది. వ్యవసాయం, పరిశ్రమలు–వాణిజ్యం, మానవాభివృద్ధి, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, ఆర్థిక రంగం, సాంఘిక సంక్షేమం, న్యాయవ్యవస్థ – శాంతిభద్రతలు, పర్యావరణం, పౌరుడు కేంద్రంగా పరిపాలన – ఇలా గుర్తించిన 10 రంగాలు కీలకమయినవే.

అటల్ బిహారి వాజపాయి స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత కీలకమయిన రాజకీయవేత్తలలో ఒకరు. 1957 నుండి 2009 దాకా జాతీయ రాజకీయాల్లో బలమైన ముద్ర వేశారు వాజపాయి. అందులో నాలుగు దశాబ్దాలపైన ప్రతిపక్షంలో ఉంటూనే, జాతి నిర్మాణంలో వాజపాయి కీలకపాత్ర వహించారు. నమ్మిన సిద్ధాంతాల కోసం రాజీలేని పోరాటం చేస్తూనే, ప్రజాస్వామ్య రాజకీయంలో విభేదాలు విధానపరంగానే తప్ప జాతి లక్ష్యాలు అందరికీ ఒకటే ఉండాలని మనసారా విశ్వసించి ఆచరణలో చూపారు వాజపాయి. మచ్చలేని వ్యక్తిత్వం, మృదుభాషణం, సభ్యత, సంస్కారం, రాజకీయ ప్రత్యర్థుల పట్ల గౌరవమర్యాదలు, నిజాయితీ, చిత్తశుద్ధి, జాతి భవిష్యత్తుని తీర్చిదిద్దటంలో రాజీలేని సంకల్పం– ఇవన్నీ మూర్తీభవించిన అరుదయిన నాయకులు వాజపాయి.

అలాగే ప్రధానమంత్రిగా బహుళ పార్టీల కూటమికి నాయకత్వం ఇవ్వటంలో ఎన్నో చికాకులు, ఆటుపోట్లు ఎదుర్కొంటున్నా, నిరంతరం దేశ ఆర్థిక ప్రగతి, సుపరిపాలనల మీదే దృష్టి పెట్టి ఎన్నో నూతన ఒరవడులకి వాజపాయి శ్రీకారం చుట్టారు. 1991లో ఆర్థిక సంక్షోభం నడుమ ఆపద్ధర్మంగా చేపట్టిన సంస్కరణలని బలోపేతం చేసి దేశ దీర్ఘకాలిక ప్రగతికి వాజపాయి పునాదులు వేశారు. జాతీయ రహదారుల నిర్మాణం, మొబైల్ టెలిఫోన్ల విస్తరణ, దీర్ఘకాల అభివృద్ధి కోసం విధానాలు, ప్రభుత్వాల ఖర్చుపైన నియంత్రణ కోసం ఆర్థిక క్రమశిక్షణ–బడ్జెట్ నిర్వహణ (FRBM) చట్టం, భవిష్యత్తు తరాలకి తలకి మించిన భారంగా తయారయిన పెన్షన్ల వ్యవస్థని సంస్కరించి నూతన విధానాన్ని తేవటం, పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేయటం, మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే రాజ్యాంగ సవరణ చేపట్టటం, పార్టీలు పారదర్శకంగా, నిజాయితీగా నిధులు సేకరించేందుకి వీలయిన చట్టాన్ని తేవటం, ఫెడరల్ వ్యవస్థని బలోపేతం చేయటం, రాష్ట్రాలకి నిధుల విషయంలో పారదర్శక పద్ధతులని అనుసరించటం– ఇవన్నీ వాజపాయి ప్రభుత్వం సాధించిన విజయాలే. బహుళ పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతూ ఎన్నో ఒడిదుడుకులని ఎదుర్కొన్నా, దేశానికి రాజకీయ సుస్థిరత్వాన్ని అందిస్తూనే చాలా రంగాలలో మౌలికమయిన మార్పులకి వాజపాయి నాంది పలికారు. స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం, ఎన్నికలలో అక్రమ ఖర్చుని ఆపటం కోసం, పాలనలో పారదర్శకత కోసం తీవ్ర ప్రయత్నాలని చేసినా రాజకీయంగా ఏకాభిప్రాయం కొరవడడంతో వాజపాయి సంకల్పం కొన్ని రంగాలలో కార్యరూపం దాల్చలేదు. అయినా నిరంతరం ఎన్నికలలో అక్రమ ఖర్చుని గూర్చి, రాజకీయంలో చోటుచేసుకుంటున్న నేరస్తుల ప్రాబల్యం, అవినీతి, తాత్కాలిక తాయిలాలని గూర్చి వాజపాయి నిరంతరం ప్రజలకి గుర్తుచేసి సంస్కరణల కోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రయత్నం చేశారు.

1999లో కేవలం ఒక్క ఓటు తేడాతో లోక్‌సభలో ప్రభుత్వం ఓటమి పాలై రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఎదురయినా పార్టీ ఫిరాయింపులని వాజపాయి ప్రోత్సహించలేదు. ఒరిస్సా ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగ్ ఇంకా తాత్కాలికంగా లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతూ తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని తెలిసినా, సభలో ఆయనకి ఓటు వేసే హక్కుని ఆపే ప్రయత్నం చేయలేదు. ప్రభుత్వం విశ్వాస తీర్మానంతో కేవలం ఒక్క ఓటుతో వీగిపోయినా, ఎలాంటి విద్వేషాలకి, హింసకి, దుర్భాషలకి తావు లేకుండా, హుందాగా ఓటమిని స్వీకరించి, రాజీనామా చేసి, ప్రశాంతంగా మళ్లీ ఎన్నికలకి సిద్ధపడ్డారు



వాజపాయి. ప్రజాస్వామ్య విలువల పట్ల, సుపరిపాలన పట్ల వాజపాయి నిబద్ధతకి ఈ ఉదంతం తిరుగులేని సాక్ష్యం.

విలువలకి, సుపరిపాలనకి కట్టుబడి ప్రజాజీవనంలో సమున్నత పాత్ర పోషించిన వాజపాయి జన్మదినాన్ని సుపరిపాలనా దినోత్సవంగా జరుపుకోవటం సముచితమే. అయితే మనం సుపరిపాలనకి ఇంకా సుదూరంగా ఉన్నామని గుర్తించటం అవసరం. సాధించిన విజయాలు మననం చేసుకోవటం ఓ జాతి ఆత్మవిశ్వాసానికి అవసరం. అయితే అంతటితో తృప్తిపడి పొరపాట్లు సరిదిద్దుకోకపోతే ప్రజాస్వామ్యం బలహీనమవుతుంది, పాలన ప్రజలకు దూరమవుతుంది. అధికారం కొంతమంది పెద్దలు గద్దెనెక్కటానికి తప్ప, సామాన్య ప్రజల స్వేచ్ఛని విస్తరించటానికి, ఎదిగే అవకాశాలు పెంచటానికి, సమర్థ సేవలందిచటానికి ఉపయోగపడదు.

మన ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ, ఎన్నికలు, శాంతియుత అధికార మార్పిడి ఉన్నమాట వాస్తవం. అయితే సుపరిపాలనకి కావలసిన ఇతర లక్షణాలు ఇప్పటికీ మన రాజకీయంలోను, పాలనా వ్యవస్థలోను లేవు. అధికారం విపరీతంగా కేంద్రీకృతమమయి నూటికి 90 పాళ్ళు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల చేతుల్లోనే ఉంది. ఉన్నకొద్దీ కేంద్రీకరణ శ్రుతిమించుతోంది. వాజపాయి ప్రభుత్వంలో యూనియన్ మంత్రులకి చాలామేరకు చొరవ, స్వేచ్ఛ ఉండేవి. కాని కాలక్రమేణ రాష్ట్రాలలో అధికారాలన్నీ ముఖ్యమంత్రుల చేతుల్లోకి చేరినట్లు, జాతీయస్థాయిలో కూడా అధికారం మరింత కేంద్రీకృతమయి, అంతా ప్రధానమంత్రి చుట్టూనే తిరుగుతోంది. ఇక మూడవ అంచె స్థానిక ప్రభుత్వాల ఊసే లేదు. ఆర్భాటంగా ఎన్నికలు జరిపి స్థానిక ప్రభుత్వాలని ఎన్నుకుంటున్నా, వాటికి బాధ్యతలు, వనరులు, అధికారాలు లేకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. బాధ్యత, జవాబుదారీతనంతో కూడిన అధికార వికేంద్రీకరణ సుపరిపాలనకి సోపానమవుతుంది. అధికార కేంద్రీకరణ కాలక్రమేణా దుష్పరిపాలనకి, బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది.

ఇక ఆర్థిక క్రమశిక్షణ సుపరిపాలనకి పునాది. ఒక కుటుంబమయినా, సంస్థ అయినా, ప్రభుత్వమయినా వనరుల్ని పొదుపుగా వినియోగించితేనే భవిష్యత్తులో ఎదుగుదల సాధ్యమవుతుంది. ఆదాయాన్ని మించి సాదరఖర్చులు పెడితే, అప్పుచేసి పప్పుకూడు తింటే, వచ్చేతరం భవిష్యత్తుని విస్మరించి తాత్కాలిక అవసరాలకే డబ్బంతా ఖర్చు చేస్తే దివాలా తీయటం అనివార్యం. బీదరికంలో ఉన్న దేశానికి మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులకి ప్రోత్సాహం, ఉపాధి కల్పన, ఆదాయం పెంపు, మంచి ప్రమాణాల విద్య ద్వారా నైపుణ్యం, ఎదిగే అవకాశాలు, మెరుగైన ఆరోగ్యం ద్వారా ఉత్పాదకత పెంచటం అత్యవసరం. ఈ కీలక రంగాలలో మన దేశం అట్టడుగు స్థాయిలో ఉంది. 49 పెద్ద దేశాలలో ప్రతి కీలకరంగంలోను భారత్ అట్టడుగు ఐదు స్థానాలలో, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా దేశాల సరసన ఉంది. ఆర్థిక ప్రగతికి మంచి అవకాశాలున్నా ప్రభుత్వాల దుబారా ఖర్చులు, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం రేపటి తరాన్ని బలిపెట్టే కుహనా రాజకీయ సంస్కృతి దేశ భవిష్యత్తుని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఉదాహరణకి వాజపాయి ప్రభుత్వం 2003-04లో ఎంతో ముందుచూపుతో దేశంలో ఏకాభిప్రాయాన్ని సాధించి పెన్షన్ సంస్కరణల్ని చేపట్టి, భవిష్యత్తు తరాల మీద భారం లేకుండా నూతన పెన్షన్ విధానాన్ని చేపట్టింది. గత 18 సంవత్సరాలుగా ఒకటి, రెండు రాష్ట్రాలు మినహాయించి ఈ విధానం విజయవంతంగా అమలవుతోంది. అయితే తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం కొన్ని రాష్ట్రాలు, కొన్ని పార్టీలు బాగా గొంతున్న సంఘటితరంగ ప్రభుత్వోద్యోగుల వత్తిడికి లొంగిపోయి, దేశంలో మిగిలిన 99 శాతం ప్రజల భవిష్యత్తుని కాలరాస్తున్నాయి. ఈనాటి అధికారం కోసం రేపటితరం భవిష్యత్తుని సమాధి చేసే హక్కు ఏ పార్టీకి, ప్రభుత్వానికి లేదు. అయితే నష్టపోతున్న సామాన్యులకి, భవిష్యత్తు తరానికి గొంతు లేదు. కాబట్టి దుష్పరిపాలన రాజ్యమేలుతోంది. ఈ ప్రమాదాన్ని అరికట్టకపోతే, సుపరిపాలన గూర్చి, ఆర్థిక క్రమశిక్షణని గూర్చి మాట్లాడటం ఆత్మవంచన అవుతుంది.

ఇక చట్టబద్ధపాలన ప్రజాస్వామ్యానికి, పరిపాలనకి మూలస్తంభం. నిజమయిన ప్రజాస్వామ్యంలో చట్టం మంది ప్రయోజనాల పరిరక్షణకి, మానవ హక్కుల రక్షణకి అవసరమయిన మేరకు తప్ప వ్యక్తుల స్వంత జీవితంలో జోక్యం చేసుకోరాదు. అలా అవసరం మేరకు చేసిన చట్టాలు కులం, మతం, డబ్బు, పలుకుబడి, అధికారంతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా వర్తించాలి. సమాజంలో అత్యున్నత స్థానాలలో ఉన్నవాళ్ళు కూడా చట్టానికి పూర్తిగా లోబడి పనిచేయాలి. సమన్యాయం అందరికి సమర్థంగా, వేగంగా, సులభంగా అందాలి. మన దేశంలో చట్టబద్ధపాలన కాగితాలకే పరిమితమయింది. 'బడితె ఉన్నవాడిదే బర్రె' చందాన పరిస్థితి తయారయింది. చట్టం ఉన్నవాడికి చుట్టమయింది. దాదాపు 5 కోట్ల కేసులు న్యాయస్థానాలలో అపరిష్కృతంగా ఉన్నాయి. లక్షల కేసులు దశాబ్దాలుగా పేరుకుపోతున్నాయి. నేరస్తుడికి శిక్షపడటం గగనం అవుతున్నది, అదే సమయంలో బీదలయిన పాపానికి బెయిలు పొందే శక్తిలేక చిన్న చిన్న నేరాలలో ఇరుక్కున్నారన్న ఆరోపణతో వేలాదిమంది జైళ్ళలో శిక్ష లేకుండానే మగ్గుతున్నారు. చట్టబద్ధపాలనా వ్యవస్థని సమూలంగా సంస్కరించటం- పోలీసు

వ్యవస్థ, ఫోరెన్సిక్ సదుపాయాలు, ప్రాసిక్యూషన్ వ్యవస్థ, సివిల్, క్రిమినల్ విచారణ పద్ధతులు, న్యాయస్థానాలలో సంస్కరణలు – సుపరిపాలనకి అత్యవసరం. ఈ ప్రయత్నాన్ని ఉద్యమంగా చేపట్టి ఫలితాలు సాధించలేకపోతే, పెరుగుతున్న పట్టణీకరణ వల్ల నేరాలు, అరాచకత్వం పెరిగి సమాజం అల్లకల్లోలమయ్యే ప్రమాదం ఉంది.

ఇక చివరగా వాజపాయి గారు నిరంతరం తపన పడ్డ అంశం ఎన్నికలలో అక్రమ ఖర్చు. ఓటర్లకి కోట్ల రూపాయల డబ్బు, మద్యం, బహుమానాల పంపిణీ రాజకీయంలో అంతర్భాగమయింది. ఇటీవల జరిగిన హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికలలో పెట్టిన అక్రమ ఖర్చు చూస్తే వాజపాయి గారి ఆత్మ క్షోభిస్తుంది. ఓటర్లకి ప్రలోభాలతోపాటు, పార్టీలు చాలావరకు తాత్కాలికమయిన తాయిలాలనే పరిపాలన అన్నట్లుగా భ్రమింప చేస్తూ ప్రభుత్వ బాధ్యతలని విస్మరించి, భవిష్యత్తుని అంధకారం చేస్తున్నాయి. ఎన్నికలలో ఎవరు నెగ్గినా, అది కేవలం అధికార క్రీడగా మారిపోయి చివరికి ప్రజలెప్పుడూ ఓటమి పాలయ్యే పరిస్థితులు దాపురించాయి. నిజంగా సుపరిపాలన సాధించాలంటే ఎన్నికల వ్యవస్థని సమూలంగా సంస్కరించటం అవసరం. సమర్థులు, నిజాయతీపరులు, ప్రజాసేవా తత్పరులు అన్ని సామాజిక వర్గాలలో, మహిళలలో, యువతలో అనేకులు ఉన్నారు. అలాంటివారు రాజకీయంలోకి ప్రవేశించి నిజాయితీగా, ప్రజామోదంతో ఎదిగి సుపరిపాలనని అందించాలంటే ఎన్నికల వ్యవస్థని సమూలంగా సంస్కరించి ప్రజాస్వామ్యాన్ని గాడినపెట్టటం నేటి చారిత్రక అవసరం.

## ఓటు విలువ తెలిసే వ్యవస్థను నిర్మించుకోవాలి



ఒక్క రూపాయి ప్రజాధనాన్ని వృధా చేస్తే దాన్ని పాపం మూటగట్టుకున్నట్టుగా ఎన్.టి రామారావు భావించేవారని, కానీ ఈవేళ ప్రజాధనాన్ని వృధా చేయటంలో ఆరితేరినవారందరికీ ఆయన పిచ్చివాడిలా కనిపిస్తారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో మాజీ ఎంపీ, సినీనటి జయప్రదకు ఎన్‌టీఆర్ శతాబ్ది పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ, తాత్కాలికంగా తాయిలాలు ఇచ్చి పబ్బం గడుపుకునేలా ఎన్‌టీఆర్ పరిపాలన చేయలేదని, అభివృద్ధి, సంక్షేమాన్ని కలిపి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారని జేపీ తెలిపారు. ఇటీవల తెలంగాణలోని మునుగోడులో పార్టీలు చేసిన ఎన్నికల వ్యయం బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో 650 స్థానాలకు రెండు ప్రధాన పార్టీలు కలిపి చేసిన ఖర్చు కంటే ఎక్కువని, మునుగోడులో ఒక్క ఓటుకు ఇచ్చిన డబ్బుతో రామారావు తమ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించారన్నారు. భారత్‌కి ఎంతో కీలకమైన ఈ తరుణంలో మన రాజకీయం ఎటు పోతోందోనన్న ఆందోళన కలుగుతోందని, అయితే నిరాశ అవసరం లేదని, ఆచరణసాధ్య పరిష్కారాలున్నాయన్నారు. ఢిల్లీకి గులాములుగా బతికిన పరిస్థితులను మార్చిన, రాష్ట్రాలకు సాధికారత తెచ్చిన ఘనత ఎన్‌టీఆర్‌దని, ఆ స్ఫూర్తితో ఫెడరలిజాన్ని మూడో అంచెకు విస్తరించి స్థానిక ప్రభుత్వాలకు సాధికారత తేవాలని, ఓటు ఎందుకు వేస్తున్నామో, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఓటు ఎందుకు వేయాలో ప్రజలకు అర్థమయ్యే వ్యవస్థను నిర్మించాలని జేపీ అన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. సినీ దర్శకుడు కోదండరామిరెడ్డి, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, నందమూరి రామకృష్ణ, డాక్టర్ శారద, శ్రీరామ్, మైథిలి అబ్బరాజు, మహ్మద్ సాబీర్ షా, సాయి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిపై వక్రభాష్యాలు మాని పాలనపై దృష్టి పెట్టండి




రాజధాని అమరావతి విషయంలో న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పునిచ్చినా మంత్రులు, అధికార పార్టీ నాయకులు వక్రభాష్యం చెబుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలుండగా వాటిని పరిష్కరించకుండా, అభివృద్ధి, పాలనను పక్కదోవ పట్టిస్తూ రాజధాని చుట్టూ అనవసర సమస్యను సృష్టిస్తున్నారన్నారు. అమరరాజా సంస్థ తరలివెళ్లటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం సంజాయిషీ ఇవ్వాలన్నారు. ఉత్తరాంధ్రలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, ఇద్దరు సీనియర్లు, మరో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ఈ ప్రాంత సమస్యల పరిష్కారం దిశగా అడుగులు పడటం లేదన్నారు. పలు పరిశ్రమలు మూతపడ్డాయి, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం రూ.100 కోట్లు కూడా తీసుకురాలేరా అని ప్రశ్నించారు. సమస్యల్ని వదిలేసి కొందరు మంత్రులు ముందస్తు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునివ్వటం ప్రజలను అపహాస్యం చేయటమన్నారు. సమావేశంలో లోక్‌సత్తా, మహిళాసత్తా నేతలు పాల్గొన్నారు.

# అవినీతి పేట్రేగుతున్నా పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం



తెలంగాణలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పేట్రేగిపోతోందని, దీన్ని వెంటనే అరికట్టాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సలహాదారు ప్రొఫెసర్ పర్చ కోదండరామారావు అన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా నిజాయతీపరులైన ఉద్యోగులకు హనుమకొండలో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న జ్వాల స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. హనుమకొండ విద్యుత్ శాఖలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పి.అశోక్, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని రెవెన్యూ శాఖలో ఏఆర్ఐగా పనిచేస్తున్న సీహెచ్ నర్సయ్యలను వేయిస్తంభాల ఆలయం వద్ద సన్మానం చేశారు. అనంతరం వారిని అశ్వాలపై డప్పు చప్పుళ్లతో పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీగా తీసుకెళ్లారు.

లంచాలు మరిగిన అధికారులను శిక్షించటం ఎంత అవసరమో, నిజాయతీగా, సమర్థంగా విధులను నిర్వహిస్తున్న అధికారులను ప్రోత్సహించటం కూడా అంతే అవసరమని కోదండరామారావు అన్నారు. డిసెంబర్ 9న అంతటా అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టకపోవటం దురదృష్టకరమన్నారు. పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం అవినీతిరహిత పాలనకు చర్యలు చేపట్టలేదని, జిల్లాలవారీగా సంస్థాగత ఏర్పాట్లతో ఏసీబీ రాజకీయ ఒత్తిడులు లేకుండా పనిచేసే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఆగడాలు పెరిగిపోతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నిజాయతీ గల అధికారులకు ప్రభుత్వంలో గుర్తింపు లేకుండా పోయిందని సన్మాన గ్రహీతలు అశోక్, నర్సయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. సహచర ఉద్యోగుల నుంచి కూడా సహకారం అందటం లేదన్నారు. లంచాలు తీసుకునే ఉద్యోగులు దర్జాగా తిరుగుతుంటే.. ఏ తప్పూ చేయని నిజాయతీ ఉద్యోగులు నేడు భయపడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నిజాయతీతో పనిచేస్తున్న ఉద్యోగులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బుర్రి కృష్ణ, ప్రకాష్, రవీందర్, సుంకరి రాజు, రామ్‌రాజ్, బుద్దె సురేష్, రాజ్‌కుమార్, అచ్చె అమర్‌నాథ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రుల్లో నియామకాలు చేయండి..

# మౌలిక వసతులు కల్పించండి



పత్తికొండ ప్రభుత్వాస్పత్రిలో వెంటనే డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకాలు చేయాలని, వసతులు కల్పించాలని లోక్‌సత్తా పార్టీ కర్నూలు జిల్లా బాధ్యుడు కె.ఆనందాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తికొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం అనంతరం కలెక్టర్, ఆర్డీఓలకు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ, పత్తికొండ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల నుండి ఆస్పత్రికి వస్తున్న గర్భిణులు, బాలింతలు సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వేరే ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ఆనందాచారి అన్నారు. మండలంలోని పుచ్చకాలమాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకే ఉంటున్నారన్నారు. తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని, ఫ్యామిలీ డాక్టర్ విధానం, నచ్చిన డాక్టర్‌ని ఎంచుకునే స్వేచ్ఛతో ప్రజలకు ఖర్చు లేకుండానే నాణ్యమైన వైద్యం, వైద్య సేవల మధ్య పోటీతో డాక్టర్లకు మెరుగైన ఆదాయం లభిస్తాయన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ పత్తికొండ అధ్యక్షుడు పి.జయరాముడు, శ్రీనివాసులు, ప్రసాద్, టైలర్ షరీఫ్, ఎర్రి స్వామి, శ్రీకాంత్, గోవిందు, సూరి, గోపాల్, తిమ్మన్న, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అమృత కాలం - యువ భారతం



భారతదేశం అనుకున్న సమయం కంటే ఏడాది ముందుగా 2023లోనే చైనాను అధిగమించి ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా అవతరించబోతోందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ప్రస్తుతం 141.2 కోట్లుగా ఉన్న దేశ జనాభా 2050 నాటికి 166.8 కోట్లకు చేరుకోవచ్చు. ఈ పెరుగుదల ఈవేళ్టి సంతానోత్పత్తి రేటు వల్ల జరగటం లేదు. గతంలో ఉన్న అధిక సంతానోత్పత్తి రేటు వల్ల ఇప్పుడు జనాభా పెరుగుతోంది. ప్రస్తుతం మన దేశంలో సంతాన సాఫల్యత శాతం అధికారిక లెక్కల ప్రకారం 2.1 కంటే తక్కువగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో 1.6 శాతంగానే ఉంది. కాబట్టి జనాభా పెరుగుదల గురించిన ఆందోళన మనకు అక్కర్లేదు. ఉన్న ఆందోళనల్లా, దేశ జనాభాలో అత్యధిక శాతమున్న యువత శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవటమెలా అన్నదే.

భారత జనాభాలో 27 శాతం 24 ఏళ్లలోపు వారు కాగా, 70 శాతం పైగా 15-64 ఏళ్ల వారు. 65 ఏళ్లు పైబడినవారు ఆరు శాతం ఉంటారని అంచనా. సగటు వయసు 28.8 సంవత్సరాలు.

పనిచేసే వయసులో (15-64) ఉన్నవారి సంఖ్యకు, ఆర్థిక వృద్ధికి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. పనిచేయగలిగిన కోట్లాది మందికి తగిన అవకాశాలు లేకుంటే అది వృద్ధిని దెబ్బతీయటంతోపాటు చట్టబద్ధపాలన సహా అనేక రకాలుగా కొత్త సమస్యల్ని సృష్టిస్తుంది. మరోవైపు, పనిచేసేవారి సంఖ్య ఇప్పుడున్నట్లు 70 శాతం ఎల్లకాలం కొనసాగదు. సంతానోత్పత్తి రేటు తగ్గుతోంది కాబట్టి, ప్రస్తుత సగటు వయసు కూడా క్రమేపీ పెరుగుతుంది. ఈలోగానే మనం యువ జనాభా సానుకూలతను సద్వినియోగం చేసుకోవాలి.

అయితే ఇప్పటిదాకా మనం యువ జనాభా సానుకూలతను సద్వినియోగం చేసుకోవటంపై పైపై మాటల్లో తప్ప చేతల్లో దృష్టి పెట్టలేదు. ఇందుకోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించలేదు.

ప్రపంచ దేశాలతోనే కాదు, సాటి ఆసియా దేశాలతో పోల్చినా పనిచేసే వయసు జనాభాని సద్వినియోగం చేసుకోవటంలో భారత్ వెనుకబడి ఉంది. కార్మిక శక్తిలో వీరి వాటా ప్రపంచ సగటు 59% కాగా, భారత్‌లో కేవలం 46%. మహిళల విషయానికొస్తే, పరిస్థితి మరీ దారుణం. వీరి వాటా ప్రపంచ సగటు 46% కాగా, భారత్‌లో కాస్త అటూఇటుగా 19 శాతం మాత్రమే. ఇదే తీరు కొనసాగితే, భారత్ వృద్ధి రేటు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. వచ్చే రెండు దశాబ్దాలలో 20 కోట్ల మందికిపైగా ఉద్యోగాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉంటుంది. ప్రచ్ఛన్న నిరుద్యోగం అదనం.

**అవకాశం తప్ప హక్కు కాదు**

ఉత్పాదకత, దాన్నుంచి వృద్ధి లేకుంటే ఆ ప్రభావం భారత్ మీద తీవ్రంగా ఉంటుంది. జీడీపీలో 1% వృద్ధి తగ్గినా ఆ ప్రభావం పదేళ్లలో రూ.50 లక్షల కోట్ల దాకా ఉంటుంది. అందుకే, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు.. యువ జనాభా సానుకూలత వల్ల వచ్చే 25-30 ఏళ్లు మనకు ఆర్థిక వృద్ధి రేటు 7-8 శాతం ఉంటుందనే అంచనా (కొన్ని సర్దుబాట్లతో) ఉన్నా కూడా భారత్‌కి అది అవకాశమే తప్ప హక్కు కాదు. యువశక్తికి నైపుణ్యాల్ని అందించి నాణ్యమైన మానవ వనరులుగా, రాజకీయం సహా వివిధ రంగాల్లో ప్రగతి చోదక శక్తులుగా తీర్చిదిద్దటం, మెరుగైన ఆదాయాల్ని ఆర్జించే అవకాశాల్ని వారికి అందించటం, ప్రపంచ పరిణామాల నేపథ్యంలో ద్రవ్యోల్బణం వంటి ఒడిదుడుకుల్ని సమర్థంగా ఎదుర్కోవటం, ఇందుకు కావలసిన రోడ్‌మ్యాప్‌ను అనుసరించటంపైనే భారత్ సుస్థిరాభివృద్ధితో అగ్రస్థాయికి ఎదిగే అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. అందుకే.. కేవలం తాత్కాలిక తాయిలాలు, ఏదోక రకంగా ఓట్లు సంపాదించటం అనే సాంప్రదాయ రాజకీయ చట్రాన్ని దాటి ఆలోచించాలి, నిస్సహాయులు, వృద్ధులు వంటి వర్గాలు గౌరవప్రదంగా బతికేందుకు తగిన సాయం అందిస్తూ సంక్షేమానికి-అభివృద్ధికి మధ్య సమతూకాన్ని రాజకీయానికి ఇరుసుగా మార్చాలి.

2030 నాటికి పనిచేసే వయసులోని జనాభా ప్రపంచంలోనే

అత్యధికంగా భారత్‌లో 96 కోట్లకు మించనుందని గతంలో యూనిసెఫ్ అధ్యయనం లెక్కేసింది. వీరిలో పట్టభద్రులు 31 కోట్ల దాకా ఉంటారని, కానీ ఉద్యోగాలకు పనికొచ్చే నైపుణ్యాలు కలిగినవారు సగం మందేనని తెలిపింది. త్వరలో పట్టా అందుకోబోతున్న యువతపై వీల్‌బాక్స్ సంస్థ తాజాగా విడుదల చేసిన నైపుణ్యాల నివేదికలో కూడా కాస్త అటూఇటుగా ఇవే గణాంకాలు. దేశంలో 15-30 ఏళ్ల వయోవర్గంలోని భారతీయుల్లో 30 శాతం అటు ఉపాధి కాని, ఇటు విద్య, నైపుణ్యం కాని లేక ఇబ్బందులు పడుతున్నారని అంచనా. ఇందుకు మొట్టమొదట దృష్టి సారించవలసింది విద్యాప్రమాణాల మీద.

**నాలుగో పారిశ్రామిక విప్లవానికి యువతను సిద్ధం చేయాలి**

విద్య అంటే గతాన్ని గుడ్డిగా అనుసరించటం కాదు, అవసరమైతే సాంప్రదాయాన్ని ఛేదించటం కూడా. కానీ మనం విద్యను పాత మూస ధోరణిలోనే చూస్తుండటం వల్ల విద్యను ఎంతో గౌరవించే సమాజమే అయినా మన చర్చ ఇప్పటికీ పాఠశాలల్లో పిల్లల నమోదు, ఉపాధ్యాయుల జీతాలు, డిగ్రీ కాగితాలు వంటి అంశాల చుట్టూనే తిరుగుతోంది. యువశక్తిని సద్వినియోగం చేసుకోవాలంటే విద్యలో సక్సెస్‌కి మన నిర్వచనం మారాలి. పునాదిలోని పాఠశాల విద్యలో మరీ ముఖ్యంగా. పాఠశాల విద్యలో మన పిల్లల సామర్థ్యం ఎంత అధ్వాన్నంగా ఉందో పీసా, అసర్ వంటి సర్వేలు ఏటా వరుసగా తెలియచేస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వాలు స్వయంగా చేయించుకున్న సర్వేలు కూడా అదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వాలు ఒక్కో విద్యార్థి మీద సగటున రూ. 80-90,000 ఖర్చు చేస్తున్నా కనీసం గడియారం చూసి గంట నిమిషాలతో కచ్చితంగా సమయం చెప్పే సామర్థ్యం 14-18 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లల్లో సగం మందికి కూడా లేని దుస్థితి తెలుగు రాష్ట్రాల్లో నెలకొంది. దేశంలోని పలుచోట్ల ఇదే అధ్వాన్న స్థితి. తరగతికి తగ్గ స్థాయిలో చదివే, లెక్కలు చేసే సామర్థ్యం దాదాపు ప్రతి రాష్ట్రంలో కొరవడుతోంది. ప్రపంచ స్థాయి విద్య మాట అలా ఉంచి, కనీసం సగటు రోజువారీ జీవితంలో ఉపయోగపడే సామర్థ్యాలు కూడా యాభై శాతానికి మించి అందటం లేదు. ఫలితంగా, వృత్తి నైపుణ్యాలున్న కార్మికులు మన దేశంలో మొత్తం శ్రామిక శక్తిలో 5 శాతంలోపే ఉండగా, చైనాలో 24%, అమెరికాలో 52%, బ్రిటన్‌లో 68%, జర్మనీలో 75%, జపాన్‌లో 80%, దక్షిణ కొరియాలో 96% ఉన్నారు. విద్యావ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం వల్లే దాదాపు 80 శాతం భారతీయ విద్యార్థుల జన్యుసంపద వృథా అవుతోంది. ఈ నేరసమాన వైఫల్యాన్ని సరిదిద్దటం మన ముందున్న తక్షణ కర్తవ్యం. విశ్లేషణ, తర్కం, నేర్చుకున్న విషయాల్ని రోజువారీ జీవితంలో వినియోగించే శక్తి, నూతన ఆవిష్కరణలు, కొత్త విషయాలను వేగంగా గ్రహించగల నేర్పు, భావ వ్యక్తీకరణ సామర్థ్యం, సృజనాత్మక, సహజమైన తెలివితేటలు (ఒరిజినాలిటీ), సాంకేతిక వినియోగం, సామాజికంగా ప్రభావితం చేయగల శక్తి, క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, ఒత్తిడిని తట్టుకునే శక్తి, ఓటమి నుంచి త్వరగా తేరుకోగల మానసిక స్థితి, నాయకత్వ లక్షణాలు మొదలైన అంశాలకు ముఖ్యంగా పాఠశాల విద్యలో ప్రాధాన్యత ఇవ్వాలి. ఇవి విద్యార్థికి ఎంతమేర పట్టుబడ్డాయో పరీక్షించే పద్ధతుల్ని అవలంబించాలి. బట్టీపట్టటం, కాపీ కొట్టటం, ర్యాంకులు వంటి పద్ధతుల్ని సమూలంగా మార్చాలి. ఈ మార్పులకు జాతీయ నూతన విద్యావిధానం అవకాశం కల్పిస్తోంది. అయితే ఆ విద్యావిధానం ఫలితాల్ని సాధించటం దానంతటదే జరగదు. రిజర్వేషన్ల పేరుతో చిచ్చు పెట్టే రాజకీయాన్ని, ఆ ఉచ్చులో చిక్కుకునే అమాయకత్వాన్ని, ప్రభుత్వోద్యోగాల చుట్టూ భ్రమల్ని అధిగమించి ప్రభుత్వాలు, దాతలు, విద్యావేత్తలు, పౌర సమాజం, తల్లిదండ్రులు ఇలా అందరూ ఇందులో భాగస్వాములై తదేకంగా కృషి చేయాలి. స్కూళ్లలో, ఆపైన దాదాపు 30 కోట్ల మంది పిల్లలు మన దేశంలో విద్యాభ్యాసంలో ఉన్నారు. కొవిడ్ తర్వాత సాంకేతికీకరణలో పెరిగిన వేగానికి అనుగుణంగా నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని మన యువత అంతా అందుకునేలా చేయాలి.

**తలకిందులుగా ఉన్న ఆరోగ్య వ్యవస్థ - దెబ్బతింటున్న ఉత్పాదకత**

అలాగే యువశక్తి సద్వినియోగానికి అవసరమైన మరో అంశం నాణ్యమైన ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవటం. తెలుగు రాష్ట్రాలు సహా మొత్తం దేశంలో మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ వ్యాధుల బారిన పడుతున్నవారిలో యువత కూడా గణనీయంగా ఉంటున్నారు. తొలిదశలోనే సమస్యను గుర్తించి వీరికి సకాలంలో సరైన వైద్యం అందించకపోవటం వల్ల ఆరోగ్య వ్యయం పెరగటంతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇది వారి నేర్చుకునే శక్తిని, ఉపాధి అవకాశాల్ని, ఉత్పాదక శక్తిని దెబ్బతీస్తోంది. ఆరోగ్యం లేనిదే న్యాయం, సమానత్వం, హుందాగా జీవించటం సాధ్యపడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం స్పష్టం చేసింది. మన దేశంలో స్వతంత్రం వచ్చిన నాటి నుంచి సరైన ఆరోగ్య విధానం, వ్యవస్థ నిర్మాణం లేకపోవటం వల్ల కుటుంబ సభ్యుల అనారోగ్యం కూడా పలువురి యువత ఎదిగే అవకాశాలను కుంగదీస్తోంది. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి వంటివి ఉన్నా దేశంలో 60-65 శాతం మంది ప్రజలు సొంతంగా జేబుల్లో నుంచి, దాచుకున్న మొత్తాల నుంచి వైద్య బిల్లులు చెల్లిస్తున్నారు. ఈ వ్యయం ప్రపంచ సగటు కేవలం 18%. వైద్యం మీద కొంత ఎక్కువ ఖర్చు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ శాతం కొంత తక్కువగా ఉన్నా, విధానం సరిగా లేకపోవటం వల్ల ఖర్చుకు తగ్గ ఆరోగ్యం అందటం లేదు. ఆర్థిక వ్యవస్థపై డయాబెటిస్, రక్తపోటు, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రభావం జాతీయ స్థాయిలో సగటున 58% ఉండగా, ఏపీలో 63% ఉందని ఇటీవల డబ్ల్యూహెచ్‌ఓ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శుల స్థాయి రెండో సదస్సులో ఆంధ్రప్రదేశ్ తెలిపింది. మధుమేహం, బీపీ, స్థూలకాయం, శ్వాసకోశ సంబంధ

వ్యాధులు, హెచ్ఐవీ వ్యాప్తి నిరోధం వంటి విభాగాల్లో ఏపీ చివరి నుంచి మూడో స్థానంలో ఉందని ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి విడుదల చేసిన సామాజిక పురోగతి నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని ఇటీవల విజిలెన్స్ శాఖ కూడా తేల్చింది. కేవలం ఆరోగ్య ఖర్చుల వల్ల దేశం మొత్తమ్మీద 5.5 కోట్ల మంది పేదలవుతుండగా, వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు 45 లక్షల మంది ఉన్నారు. ఈ ఖర్చులు భరించలేక పలువురు వ్యాధుల్ని ముదరబెట్టుకుంటున్నారు. ముఖ్యంగా మహిళలు. కుటుంబ నియంత్రణ సహా ఆరోగ్య సంబంధ విషయాల్లో వారి పట్ల సాంప్రదాయ వివక్ష కూడా స్త్రీలను కుంగదీస్తోంది. తగినంత మంది వైద్యులు అందుబాటులో ఉన్నా. ప్రాథమిక ఆరోగ్యం సరిగా లేకపోవటం, ప్రాథమిక-ద్వితీయ-తృతీయ స్థాయి ఆరోగ్యాల మధ్య అనుసంధానం లేకపోవటం వల్లే కోవిడ్ రెండో దశలో దేశంలో లక్షల మంది అకాల మరణం పాలయ్యారని గుర్తించినా, ఇప్పటికీ మన ప్రభుత్వాలు పాఠం నేర్చుకోలేదు. ఖరీదైన, అసంబద్ధమైన అమెరికా వైద్య నమూనాను అనుకరిస్తూ సూపర్ స్పెషాలిటీ వైద్యం, కొత్త మెడికల్ కాలేజీల చుట్టూనే ఇంకా ఆలోచనలు, ఆర్భాటాలు చేస్తున్నాయి. తలకిందులుగా ఉన్న ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థను సరిచేయాలి.

ఆధునిక అవకాశాలతో జీవనకాలం పెరుగుతూ (1950లలో 32 ఏళ్లుగా ఉన్న సగటు ఆయుర్దాయం భారత్‌లో ఇప్పుడు 70.19) నూతన ఆవిష్కరణలు విస్తరిస్తున్నకొద్దీ ఆరోగ్య భారం ప్రజల్ని ఇంకా కుంగదీస్తుంటుంది. వైద్యుల సంఖ్య, వైద్య సేవల నాణ్యత, వైద్య సిబ్బంది అందుబాటు, ఆధునిక సాంకేతికత, ఔషధాల తయారీ మొదలైన విభాగాల్లో భారత్‌కున్న బలాల్ని ఉపయోగించుకుంటూ తక్కువ ఖర్చుతో ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే సమగ్ర ఆరోగ్య విధానాన్ని రూపొందించటం యువ భారత్ శక్తిని సద్వినియోగం చేయటానికి అత్యంత కీలకం. ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో, వైద్యుల మధ్య పోటీతో, ప్రజలకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛతో ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానం నమూనాను ఇందుకు పరిగణలోకి తీసుకోవచ్చు. ఈ విధానంలో జీడీపీలో అర శాతం కేటాయింపుల్ని పెంచితే జేబుఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం అందటంతోపాటు దాదాపు రెండు కోట్ల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**చట్టం సరిగా పనిచేయకపోవటం వల్ల అవకాశాల్ని కోల్పోతున్నారు**

భారతదేశ శక్తిసామర్థ్యాలను అణగదొక్కుతున్న మరో అంశం చట్టబద్ధపాలన వైఫల్యం. చట్టం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడుతుందన్న నమ్మకం లేకపోవటం వల్ల వారి ఉపాధి అవకాశాలు పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా మహిళలు కాస్త దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవటానికి, ఉద్యోగమో వ్యాపారమో చేయటానికి సంకోచిస్తున్నారు. అలాగే ఆస్తి, వ్యాపార లావాదేవీలకు చొరవ చూపటానికి కూడా చట్టబద్ధపాలన వైఫల్యం అవరోధంగా ఉంది. కోర్టుకి వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేకపోవటం వల్ల సివిల్ కేసుల కంటే క్రిమినల్ కేసులు ఎక్కువగా

## 50 లక్షల నుంచి 800 కోట్లకు ప్రపంచ జనాభా

క్రీస్తు పూర్వం 8000 సంవత్సరం ప్రాంతంలో ప్రపంచ జనాభా దాదాపు 50 లక్షలుగా ఉండేదని అంచనా. క్రీస్తు శకం 1వ శతాబ్దం నాటికి 20 కోట్లకు చేరింది. కొన్ని అంచనాలు 30 కోట్లు, 60 కోట్లు అని కూడా చెబుతున్నాయి.

1804 సంవత్సరంలో ప్రపంచంలో మానవుల సంఖ్య వంద కోట్లకు చేరింది. పారిశ్రామిక విప్లవంతో ఆర్థిక పురోభివృద్ధి ఊపందుకుంది. వైద్యంలో అద్భుత పురోగతి వల్ల అకాల మరణాలు తగ్గిపోయాయి. ముఖ్యంగా శిశువుల్లో ఇవి బాగా తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా సగటు ఆయుర్దాయం గణనీయంగా పెరిగింది. ఇది జనాభా పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో ప్రపంచ జనాభా 200 కోట్ల స్థాయికి చేరుకోవడానికి 126 ఏళ్లు మాత్రమే పట్టింది. 300 కోట్ల మార్కుకి మరో 30 ఏళ్లు, 400 కోట్ల స్థాయికి 14ఏళ్లు, 500 కోట్ల మార్కుని తాకటానికి 13 ఏళ్లు పట్టింది. 600 కోట్ల స్థాయిని మాత్రం చాలా వేగంగా 11 సంవత్సరాల్లోనే మానవాళి సాధించింది. అనంతరం 700 కోట్ల స్థాయిని తాకటానికి 12 ఏళ్లు పట్టింది. 2022లో 800 కోట్ల మార్కుకూ ఇంతే సమయం అవసరమైంది. 20వ శతాబ్దంలోనే ప్రపంచ జనాభా 165 కోట్ల నుంచి 600 కోట్లకు పెరిగింది. అయితే ఈ పెరుగుదల రేటు తగ్గుతుండటం వల్ల ప్రపంచ జనాభా రెట్టింపు కావటానికి మరో 200 ఏళ్లు పట్టవచ్చు.

2022లో ప్రపంచ జనాభాలో పురుషులు 50.3 శాతం, మహిళలు 49.7 శాతం ఉన్నారు. ఈ అంతరం క్రమంగా తగ్గుతుంది. 2050 నాటికి అది సమాన స్థాయికి చేరొచ్చు.

2050 నాటికి జనాభా పరంగా మొదటి పది స్థానాల్లో భారత్, చైనా, నైజీరియా, అమెరికా, పాకిస్థాన్, ఇండొనేషియా, బ్రెజిల్, ఇథియోపియా, కాంగో, బంగ్లాదేశ్ ఉంటాయి.

భారతదేశ జనాభా 1972లో జనాభా 58 కోట్లుండగా, 2022లో అది 141 కోట్లు దాటింది. బహుశా మరో 30 ఏళ్ల కాలంలో మన దేశ జనాభా 160 కోట్లకు చేరుకుని, అప్పట్నుంచి క్రమంగా తగ్గుతుంది. 2100 నాటికి మన దేశ జనాభా 109 కోట్లకు తగ్గుతుందని అంచనా.

1050 నుంచి చూస్తే జనాభా పెరుగుదల రేటు 2020లోనే అతి తక్కువగా ఉంది.

ప్రపంచ జనాభాకు 1040 కోట్లు పతాక స్థాయి అని, 2080 నుంచి 2100 వరకు అదే స్థాయిలో కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. 1990లో 63.8 ఏళ్లుగా ఉన్న ప్రపంచ సగటు ఆయుర్దాయం ఇప్పుడు 72.8 ఏళ్లకు పెరిగిందని, 2050 నాటికి 77.2కు పెరుగుతుందని తెలిపింది.

## చైనా - భారత్

1985 ప్రాంతంలో చైనా జీడీపీ (27,297 కోట్ల డాలర్ల) కన్నా భారత జీడీపీ (27,903 కోట్ల డాలర్లు) కాస్త ఎక్కువ. నాడు చైనా తలసరి ఆదాయం 318 డాలర్లయితే భారత్ తలసరి ఆదాయం 368 డాలర్లు. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. ఒకప్పుడు చైనా కన్నా పైమెట్టు మీదున్న భారత్ నేడు ఎంతో వెనకబడిపోయింది. 2022లో భారత్ జీడీపీ 3.31 లక్షల కోట్ల డాలర్లు. అదే, చైనా.. ఈవేళ 18.32 లక్షల కోట్ల డాలర్ల ఆదాయంతో ప్రపంచంలో అమెరికా తరవాత అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. భారత ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగ వాటా 20 శాతానికిలోపే ఉండగా, చైనాలో అది 30 శాతం. ప్రపంచీకరణను ఉపయోగించుకుని పారిశ్రామిక ఉత్పత్తులను దేశదేశాలకు ఎగుమతి చేసి చైనా అపారంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది.

+ భారత్ తన జీడీపీలో 30 శాతాన్ని మాత్రమే పెట్టుబడిగా పెడుతుండగా, చైనా 50 శాతాన్ని పెట్టుబడి వ్యయంగా ఉపయోగిస్తోంది.

+ ఉత్పాదకతలోనూ చైనా పోటీ పడి ప్రమాణాలను పెంచుకుంటూ భారత్ కంటే అనేక రెట్లు ముందుంది.

నమోదవుతున్నాయి. పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకం, అందుబాటులో న్యాయం లేకపోవటంతో ప్రజలు బండన్యాయాన్ని ఆశ్రయిస్తున్నారు లేదా మౌనంగా అన్యాయాన్ని దిగమింగుతున్నారు. దీనివల్ల నేర రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. ఆర్థిక వృద్ధికి, ఉపాధి అవకాశాలు, ఉత్పాదకత పెరగటానికి చట్టబద్ధపాలనను సంస్కరించటం, న్యాయ ప్రక్రియ ప్రమాణాల్ని పెంచటం, సత్వర న్యాయానికి గ్రామ న్యాయాలయాల చట్టం వంటివి అమలు చేయటం, సాంకేతికత వినియోగం భారత్‌కి ఎంతో కీలకం.

**వికేంద్రీకరణ - అమరావతి ఉదాహరణ**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిపై వివాదాన్ని చూస్తే మన దేశానికి సంబంధించిన ఒక మౌలిక వైఫల్యం స్పష్టంగా తెలుస్తుంది. రాజధానిగా అమరావతికి అసెంబ్లీ సాక్షిగా ఆమోదం తెలిపి, ఆ తర్వాత ముఖ్యమంత్రి అయ్యాక వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ప్రతిపాదన చేయటం తీవ్ర వివాదాస్పదమయింది. మూడు రాజధానులకు వ్యతిరేకంగా పలు ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలన్నీ మద్దతిస్తున్నాయి. వికేంద్రీకరణ కోసమే మూడు రాజధానుల్ని ఏర్పాటు చేస్తున్నామని వాదిస్తూ జగన్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. అయితే వికేంద్రీకరణ అంటే రాజధానిని మూడు చోట్ల సర్దటం కాదని, అధికారాన్ని, నిధుల్ని బదిలీ చేసి ఎక్కడి పనులు అక్కడే పూర్తయ్యే వ్యవస్థ నిర్మాణం చేయటమని లోక్‌సత్తా తప్ప ఒక్క పార్టీ, ఒక్క సంస్థ కూడా ప్రజలకు విస్పష్టంగా తెలియచెప్పే ప్రయత్నం చేయలేదు. మూడు రాజధానుల పేరుతో కొన్ని కార్యాలయాల్ని మాత్రం ఏర్పాటు చేస్తూ కేవలం రాజధానిని విస్తరిస్తున్నా, గ్రామ సచివాలయాలు కూడా ఉన్నా.. ముఖ్యమంత్రి చేతుల్లో తప్ప మంత్రులకు కూడా అధికారాలు లేవన్న వాస్తవంపై ఎవరూ నిలదీయకుండా అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలన్న అంశం చుట్టూనే చర్చను తిప్పుతున్నారు.

(ఆస్ట్రేలియాలో మాజీ ప్రధాని స్కాట్ మోరిసన్ తాను అధికారంలో ఉన్నప్పుడు తెర వెనుక నుంచి అయిదు మంత్రిత్వ శాఖలను నడిపించారని, సదరు మంత్రులకు తెలియకుండా వారి అధికారాలను తానే గుప్పిట్లో పెట్టుకున్నారని ఆరోపిస్తూ వామపక్ష మధ్యేవాద లేబర్ పార్టీ ప్రభుత్వం పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది. ప్రధానిగా మోరిసన్ 2020 మార్చి నుంచి 2021 మే వరకు అధికారంలో ఉన్నారు. ఆ తర్వాత లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మోరిసన్‌పై అభిశంసన తీర్మానం 86-50 ఓట్ల తేడాతో నెగ్గింది. ప్రస్తుతం మోరిసన్ ప్రతిపక్షంలో ఉన్నారు కాబట్టి అభిశంసన వల్ల ఊడటానికి ఆయనకు పదవి ఏమీ లేదు. ఆయన రాజకీయ ప్రతిష్ఠ మాత్రం మసకబారొచ్చు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసినందుకు మోరిసన్ జాతికి క్షమాపణ చెప్పాలని ప్రధాని ఆంటోనీ అల్బనీస్ డిమాండ్ చేశారు).

**ఎ) 'టీనా' ఇమేజ్ నిర్మించుకుంటున్నారు**

దీనంతటికీ మూలం మన రాజకీయ వ్యవస్థలో, సమాజంలో కూడా అధికార కేంద్రీకరణ పట్ల ఉన్న లాలస. మన కుటుంబంలో, పాలనలో, రాజకీయాల్లో అన్నిట్లో కేంద్రీకృత పోకడలకు మనం లొంగి బతుకుతున్నాం. ప్రచారానికి, రాజకీయానికి మధ్య తేడా చెరిగిపోయి ఎవరు ఎంత ప్రచారంలో ఉంటే అంత అంకితభావంతో రాజకీయం చేస్తున్నారన్న భ్రమ ప్రబలిన ఇటీవలి కాలంలో ఇది మరింత పెరిగిపోయింది. ఆమధ్య ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పార్టీ నేతల సమావేశంలోనే ఈ విషయాన్ని అంగీకరించారు. కర్ణాటకలో వందేభారత్ రైలును ప్రారంభించటానికి తాను వెళ్లనక్కర్లేదని, కానీ తాను వెళ్తేనే ఎక్కువ ప్రచారం వచ్చి పార్టీకి లాభం జరుగుతుంది కాబట్టి వెళ్లానని చెప్పుకొచ్చారు. పలు రాష్ట్రాల్లో కూడా పథకాల రూపకల్పనలో ప్రజలకు మేలు చేయటం కన్నా అధికార పార్టీ నాయకత్వం చుట్టూ ప్రచారం లభించటమే ప్రాతిపదిక అవుతోంది. ఆరోగ్య రంగం ఇందుకు తాజా ఉదాహరణ. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యం అందటం కాకుండా ప్రభుత్వ, నేతల మెహర్బానీకి ప్రాధాన్యత ఇస్తూ కార్యక్రమాల్ని, నియామకాల్ని చేస్తుండటం వల్ల మన ఆరోగ్య విధానం తలకిందులుగా తయారై ప్రభుత్వ వ్యయానికి ఫలితం రాకపోగా, ప్రజలు సొంతంగా కూడా భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రజలు నష్టపోయినా సరే మా పెత్తనానికి ఢోకా ఉండకూడదన్నట్లు నేతాగణం, పార్టీలు వ్యవహరిస్తున్నాయి. 'టీనా' (ప్రత్యామ్నాయం లేదు) ఇమేజ్‌ను తమ చుట్టూ నిర్మించుకుంటున్నాయి. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రికి తప్ప ఎవరికీ అధికారాలులేని దశకు ఇప్పుడు

కేంద్రీకరణ చేరుకుంది.

ఈ కేంద్రీకృత రాజకీయం, పాలన వల్ల విద్య, వైద్యంతోపాటు పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, రక్షిత తాగునీరు, వ్యాధి నివారణా చర్యలు వంటి పలు రోజువారీ కీలక సేవలు పేలవంగా తయారై యువత మూల్యం చెల్లిస్తున్నారు. అలాగే సమర్థులు, నిజాయతీపరులైన యువతకు రాజకీయాల్లో అవకాశాలు లభించక వారి సామర్థ్యం, కొత్త ఆలోచనలు దేశానికి ఉపయోగపడటం లేదు. పౌర సేవల పట్ల నమ్మకం లేక, రాజకీయంలో ఎదిగే అవకాశాలు లేక నోటు, తాయిలాల కోసం అర్రులు జాచేవారుగా, జెండాలు మోసే కూలీలుగా సామాన్య యువతలో అత్యధికులు తయారవుతున్నారు. బ్రిటన్‌లో రిషి సునాక్ 35 ఏళ్లకే ఎంపీ అయి, 42 ఏళ్లకు ప్రధానమంత్రి కాగా, యువత అత్యధిక సంఖ్యలో ఉన్న మన దేశంలో కేవలం నాయకులు, సంపన్నుల కొడుకులు, కూతుళ్లు, కుటుంబ సభ్యులు తప్ప దాదాపు ఇంకెవరూ ఓ ప్రధాన పార్టీ తరపున పోటీ చేయటమనే ఊహ కూడా చేయలేకపోతున్నారు. ప్రస్తుత లోక్‌సభలో 40 ఏళ్ల లోపు ఎంపీలు 64 మంది ఉండగా, వారిలో అత్యధికులు ప్రముఖ రాజకీయ కుటుంబాల నేపథ్యం ఉండటం వల్లే ఆ వయసులో అభ్యర్థులు కాగలిగారు. అధికార వికేంద్రీకరణపై మన రాజ్యాంగ నిర్మాణ సమయం నుండీ జరుగుతున్న తప్పిదాన్ని సరిచేస్తేనే లక్షలాది నాయకులు ఆవిర్భవిస్తారు, యువతకు అవకాశాలు అంది, రాజకీయ, పాలనా నాయకత్వ శిక్షణ లభించి ఈ దేశాన్ని ఏలుకోగలుగుతారు. కనీస సౌకర్యాలు, ప్రజల భాగస్వామ్యంతో రోజువారీ జీవితాలు మెరుగుపడతాయి.

**బి) ఇలాంటి శత్రువులుంటే కేంద్రీకృత పాలకులకు వేరే మిత్రులక్కర్లేదు**

కానీ కేంద్రీకృత పాలనను విమర్శించేవారు కూడా గ్రామాల్లో కులతత్వం కొనసాగుతోంది కాబట్టి స్థానిక స్థాయికి వికేంద్రీకరణ నష్టదాయకమనే వాదనల్ని వినిపిస్తున్నారు. ఈ విషయంలో రాజ్యాంగ నిర్మాణ సమయంలో డాక్టర్ అంబేద్కర్ వ్యక్తం చేసిన భయాల్నే ఉటంకిస్తున్నారు. కానీ ఆనాడు చేసిన పొరపాటు వల్ల భారత్ ఎంత మూల్యం చెల్లించిందో, ఎన్ని తరాలు, ఎన్ని కోట్ల మంది తమ జీవితంలో సాధికారతను కోల్పోయి ద్వితీయ శ్రేణి పౌరులుగా మనుగడ సాగించారో, సాగిస్తున్నారో వారు ఆలోచన చేయటం లేదు. ఇలాంటి శత్రువులుంటే సాంప్రదాయ రాజకీయ పార్టీలకు వేరే మిత్రులు అక్కర్లేదు. తమ పెత్తందారీ రాజకీయాన్ని, కేంద్రీకృత పాలనను మరింత సుస్థిరం చేసుకుంటారు.

గాంధీజీ చెప్పినట్లు గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేయటం కుల తత్వం వంటి జాడ్యాలను కొనసాగించే అవకాశముంది, కొన్ని రకాలుగా ఆచరణసాధ్యం కూడా కాదు అనటంలో సందేహం లేదు. కానీ పరిష్కారం గాంధీ, అంబేద్కర్ ఇద్దరినీ కలపటంలో ఉంది తప్ప స్థానిక స్వపరిపాలనను తిరస్కరించటంలో లేదు. లోక్‌సత్తా జేపీ సూచించినట్లు, ఒక గ్రామం యూనిట్‌గా కాకుండా, కొన్ని గ్రామాలను కలిపి క్లస్టర్‌గా ఏర్పాటు చేసి అధికారాన్ని, నిధుల్ని వికేంద్రీకరిస్తే, అక్కడ తప్పు జరిగితే జవాబుదారీతనానికి ఏర్పాటు చేస్తే సుపరిపాలన, స్వపరిపాలన, ప్రజాస్వామ్యం పెరుగుతాయి, క్రమంగా కులం బలహీనపడుతుంది. ఎన్ని లోపాలున్నా ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యం, తన జీవితం మీద చిట్టచివరి పౌరునికి కూడా సాధికారత ఉండటం తప్ప మరో పరిష్కారం లేదు. అందుకు తగిన ప్రోత్సాహకాలతో సంస్థాగత ఏర్పాటు చేయకుండా పైన ఎంత గొప్ప నాయకుడు, ఎంత గొప్ప ఆశయాలున్న పార్టీ వచ్చినా, పై నుంచి ఎన్ని పథకాల్ని రూపొందించి అమలు చేసినా, పందేరాలు చేసినా ఆశించిన ఫలితాలు రావు. లోతైన ఆలోచన చేయకపోవటం వల్లే స్థానిక ప్రభుత్వాల సాధికారత పేరుతో తెచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణలు కేవలం సంకేతంగా మిగిలిపోయాయి.

దేశానికి స్వతంత్రం వచ్చాక 73, 74వ రాజ్యాంగ సవరణలు వచ్చే దాకా (1992) కొంతకాలం స్థానిక ప్రభుత్వాలకు గుర్తింపు కొనసాగింది. అప్పట్లో జడ్‌పీ చైర్మన్లు మంత్రులకన్నా శక్తిమంతంగా ఉండేవారు. ఆ సమయంలోనే కనీసం 24 మంది ముఖ్యమంత్రులు, 2 కేంద్ర మంత్రులను స్థానిక ప్రభుత్వాలు అందించాయి. 1993 తర్వాత ఈ జాబితాలో వంశపారంపర్య రాజకీయ నేతల్ని మినహాయిస్తే దేవేంద్ర ఫడ్నవిస్, దినేష్ శర్మ, భూపేంద్ర పటేల్ వంటి మూడు నాలుగు పేర్లే కనిపిస్తాయి. ఈ రాజ్యాంగ సవరణల ద్వారా వికేంద్రీకరణ అసాధ్యంగా కనిపిస్తోంది. యూనియన్ ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల్లో 3-4 శాతం స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయటానికి కూడా రాష్ట్ర ప్రభుత్వాలు కొర్రీలు పెడుతున్నాయి. అదే అమెరికా వంటి దేశాల్లో 30% దాకా స్థానిక ప్రభుత్వాలకు కేటాయిస్తున్నారు. జర్మనీ వంటి దేశాల్లో పాస్‌పోర్ట్ వంటి సేవల్ని కూడా స్థానిక ప్రభుత్వమే నిర్వహిస్తుంది. స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం పార్టీలన్నీ ఏకాభిప్రాయంతో కృషి చేయటం అవసరం. స్థానిక సాధికారత లేకపోవటం వల్ల అక్కడ అణగారిన వర్గాలకు, మహిళలకు రిజర్వేషన్ల వల్ల కూడా ఫలితం లేకుండా పోయింది. మహిళా ప్రజాప్రతినిధుల బదులు వారి ఇంట్లోని మగవారు పెత్తనం చేయటం కన్నా కూడా.. ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇవ్వకుండా ఎన్నికైనవారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చటం పెద్ద వ్యవస్థాగత తప్పిదం. కనీసం నగరాల నుంచయినా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం ఇప్పుడు ఇండియాకి అవసరం. ఆర్థిక చోదక శక్తులుగా ఉండే మహానగరాల సుస్థిర వృద్ధికి కూడా బలమైన స్థానిక పాలన తప్పనిసరి. మనం 2020-21లో హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలప్పుడు ఆవేశపడిపోయాం గానీ, ఆ తర్వాత ఏం జరుగుతోందో పట్టించుకోవటం లేదు. ఎందుకిలా జరుగుతోంది అని ఆలోచించకుండా అంతా రాజకీయ నాయకులకు వదిలేసి నిరాశావాద ప్రవాహంలో కొట్టుకుపోతున్నాం. ఇటీవల రిజర్వు బ్యాంకు కూడా నగరాలకు ఆర్థిక, పాలనా సౌష్టవం తప్పనిసరి అని స్పష్టం చేసింది. 2030 నాటికి మన దేశంలో 10 లక్షలకు

పైబడిన నగరాలు 60కి పైగా ఉంటాయని అంచనా.

పరిపాలన, రాజకీయం ప్రధానంగా రాష్ట్రాల్లో ఉంటుంది. రాష్ట్రాల్లో ఫెడరలిజం ఇప్పుడు గణనీయంగా మెరుగుపడింది. పోటాపోటీ ఎన్నికల రాజకీయాల వల్ల కొన్ని ఒడిదుడుకులున్నా కూడా సహకార, పోటీ ఫెడరలిజం ఒక చట్టబద్ధ ఏర్పాటుగా మాత్రమే కాకుండా సంస్కృతిగా కూడా మారుతోంది. ఫెడరలిజాన్ని మూడో అంచెలోకి తీసుకెళ్లి స్థానిక ప్రభుత్వాలను వార్డు స్థాయి కమిటీల వరకూ పౌరుల భాగస్వామ్యంతో బలోపేతం చేయటం ఇప్పుడు మనకు ప్రధానంగా కావలసినది. స్థానిక ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం వల్ల ఆ ప్రభావం రాష్ట్ర స్థాయి పాలనపై కూడా పడుతూ అధికార పార్టీలకు రాజకీయంగా చెడ్డ పేరు తెస్తోంది. అందుకే స్థానిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ చొరవ చూపాలి.

ఎన్.టి రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెచ్చిన 'క్రాంతి పథం' వంటి పథకాలు (ఈ పథకాన్ని ఉపయోగించుకునే లోక్‌సత్తా జేపీ ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు రైతుల భాగస్వామ్యంతో రెండు లక్షలకు పైగా ఎకరాలకు ఎకరాకు కేవలం రూ.2,000 ఖర్చుతో సాగునీరు అందించి స్వతంత్ర భారత చరిత్రలో రికార్డు నెలకొల్పారు), ఇతరత్రా వివిధ పద్ధతుల్లో వికేంద్రీకరణను అమలు చేస్తూ స్థానిక, జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక సామర్థ్యాలు కూడా పెరిగి ఉత్పత్తి, ఎగుమతులు, తద్వారా ఉపాధి అవకాశాలు ఊపందుకుంటాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ కంపెనీ తరహాలో.. ఉద్యోగం చేయాలనుకుంటున్న ప్రతివారికీ ఉపాధి లభించే ఉత్సాహపూరిత వాతావరణం అనేక చోట్ల నెలకొంటుంది.

**వ్యవసాయం - చిన్న పట్టణాల అభివృద్ధి**

ఇంకో కీలకాంశం వ్యవసాయం. తొలి నుంచీ విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవటం వల్ల మన దేశంలో ఇప్పటికీ అత్యధిక శాతం ప్రజలు ఈ రంగం మీదే ఆధారపడుతున్నారు. సామాజిక, ఆహార, ఆర్థిక ఇలా అన్ని రకాలుగా దేశ భవిష్యత్తుకి కీలకమైన రంగం వ్యవసాయం. ఉత్పాదకత పెంపు కోసం సాంకేతికతను రైతు అనుభవాన్ని మేళవించటం, ఈ రంగాన్ని స్వేచ్ఛా మార్కెట్‌తో పరిశ్రమలతో సంధానం చేయటం, రైతులకు అమ్మకం ధరలో వాటాని ఇప్పుడు లభిస్తున్న 25-30 శాతం నుంచి 60-70 శాతం దాకా పెంచటం అవసరం. ఈ క్రమంలో గ్రామాల మధ్యలో చిన్న పట్టణాలలో ఆధునిక పారిశ్రామికీకరణను ప్రోత్సహించి వాటిని ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ప్రతి పౌరుని పౌష్టికాహార భద్రతకూ భరోసాతోపాటు.. శీతల గిడ్డంగులు, రోడ్లు సహా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల్ని నిర్మించి, భూమి హక్కుల్లో సంక్లిష్టతలు లేకుండా చేసి, రిటైల్ చెయిన్లను తెచ్చి, చిన్న పట్టణాలను వ్యవసాయాధారిత పరిశ్రమలతో ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, నిలకడైన ఎగుమతుల విధానాన్ని అమలు చేయాలి. ప్రపంచంలోని చాలా దేశాలతో పోలిస్తే మన దేశంలో పట్టణీకరణ తక్కువగానే ఉన్నా.. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న దశలో ఉన్నాం. 2035 నాటికి 68 కోట్ల మంది, 2050 నాటికి 82 కోట్ల మందికి పైగా దేశ జనాభా పట్టణ ప్రాంతాల్లోనే ఉంటారని అంచనా. అంటే యువ భారత్ భవిష్యత్తు పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా, జీవనయోగ్యమైనవిగా తీర్చిదిద్దటంపై ఆధారపడి ఉంది. గ్రామాల నుంచి వలస వచ్చే వారు నగరాలపై విపరీత భారం వేయకుండా, గ్రామాలు నిర్జనం కాకుండా చిన్న పట్టణాల అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా చేపట్టటం అవసరం. 1991లో ఆర్థిక సరళీకరణ తర్వాత కేవలం మూడు నగరాలు మాత్రమే పట్టణ, గ్రామీణ ప్రణాళికా చట్టాన్ని సవరించాయి. ఈ మధ్య కాలంలో కొంత కదలిక కనిపిస్తోంది గానీ ఇంకా రాజకీయ క్రీనీడ నుంచి పట్టణ ప్రాంతాలు బయటపడలేదు. ప్రణాళికాబద్ధ పట్టణాల నిర్మాణం, వివిధ ఆర్థిక కలాపాల కోసం వచ్చిపోయేవారికి తగిన వసతులు, స్థానిక సాధికారతకు వ్యవస్థీకృత ఏర్పాట్ల వల్ల యువత శక్తిసామర్థ్యాలు నిర్మాణాత్మకంగా వికసిస్తాయి. వారికి, దేశానికి కూడా ప్రయోజనం చేకూరుస్తాయి.

**మన రిషి సునాక్‌ల సామర్థ్యమూ దేశానికి ఉపయోగపడాలి**

అలాగే రాజకీయాల్లో, పాలనలో యువత ప్రాతినిధ్యం పెరిగేందుకు, వారి సామర్థ్యాలు దేశానికి ఉపయోగించేందుకు కూడా తగిన ఏర్పాట్లు అవసరం.

ఒకప్పుడు మనల్ని పాలించి తెలుపు-నలుపు అంటూ ఆధిపత్యం చూపిన బ్రిటన్‌ని ఆర్థిక పరిమాణంలో అధిగమించి అయిదో స్థానంలోకి వచ్చాం, మన మూలాలున్న రిషి సునాక్ ఆ దేశానికి ప్రధానమంత్రి అయ్యాడని గర్వంగా చెప్పుకుంటున్నాంగానీ.. అలా మన యువత రాజకీయాల్లో ఎందుకు ఎదగలేకపోతున్నారు, దేశాన్ని ముందుకు నడిపించలేకపోతున్నారు అని ఆత్మవిమర్శ చేసుకోలేకపోతున్నాం. రిషి సునాక్‌లా సమర్థులైన యువత మన దేశంలోనూ పుష్కలంగా ఉన్నారు. వీరు నాయకులుగా విధాన నిర్ణయాల్లో భాగస్వాములయ్యేందుకు స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠం చేయటం, పౌర సేవల్ని మెరుగుపరచటంతోపాటు కొన్ని ఎన్నికల సంస్కరణల్ని కూడా తీసుకురావాలి.

ప్రస్తుమున్న రీతిలో ఒక్క ఓటు ఎక్కువ రావటం కోసం విపరీత డబ్బు, ప్రలోభాలు, కుల, మత రాజకీయాల మధ్య జరుగుతున్న ఎన్నికల్లో సామాన్య యువత గెలవలేరు. కాబట్టి ప్రస్తుతమున్న ఎన్నికల వ్యవస్థను మార్చి ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా విధానం మార్పుల్ని తీసుకురావాలి. ఈ ఎన్నికల సంస్కరణల వల్ల డబ్బు ప్రభావం నియంత్రణలోకి రావటంతోపాటు ఎమ్మెల్యే, ఎంపీలు ప్రభుత్వ కార్యాలయాల్లో జోక్యం చేసుకునే పరిస్థితి కూడా మారుతుంది. పౌర సేవలు లంచాల్లేకుండా, జవాబుదారీతనంతో అందటానికి మరింత గ్యారంటీ లభిస్తుంది. అధికారాల విభజన స్పష్టంగా ఉండి శాసన సభ్యులు చట్టసభల్లో చర్చలు, మెరుగైన చట్టాలు తేవటం మీద, వాటి అమలులో లోపాలు సరిదిద్దటంపైన దృష్టి పెడతారు, స్థానిక ప్రభుత్వాలు బలోపేతమవుతాయి, సమాజంలోని నిష్ణాతులు

కూడా మంత్రిమండలి ద్వారా ప్రజలకు సేవలందించే అవకాశాలు ఏర్పడతాయి. అప్పుడు నేరస్తులో, డబ్బుతో ఓట్లు కొనేవారో, ప్రజల సొమ్మును పందేరం చేస్తూ సొంతసొమ్మన్నట్లు దానకర్ణుల్లా ఫోజులిచ్చేవారో కాకుండా.. సమస్యల్ని లోతైన అవగాహనతో పరిష్కరించే పాలనా సామర్థ్యం గలవారు, ముందుచూపును ప్రదర్శించే నాయకులు పాలకులు కాగలుగుతారు. ప్రజల ఓటులో ప్రలోభాల స్థానంలో పౌరసత్వం పనిచేస్తుంది. స్వచ్ఛందంగా ఓటు వేయటానికి మొగ్గు చూపేవారి సంఖ్య పెరుగుతుంది.

ఇదే సమయంలో పార్టీల్లో కొందరు నేతలు, వారి కుటుంబ సభ్యులు, డబ్బున్నవాళ్లు మాత్రమే ఎదిగే అవకాశాలు లేకుండా ప్రతి రాజకీయ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి. పార్టీ నాయకత్వం, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కొందరు నేతల చేతుల్లో లేకుండా పార్టీ సభ్యులు, ప్రజల చేతుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలి, సమాజంలోని సమర్థులు, నిజాయతీపరులకు అవకాశాలు అందుబాటులోకి తేవాలి, నిధుల సేకరణకు పారదర్శకమైన, సమర్థవంతమైన ఏర్పాటు చేయాలి.

**మన కంటే తక్కువ వృద్ధి రేటు ఉన్నా ఆ దేశాల్లో ఉద్యోగాల సృష్టి ఎక్కువగా ఉంది..**

**ఈ మార్పులు లేకుంటే ఆర్థిక వృద్ధి తాత్కాలిక వెలుగుగా తప్ప దీర్ఘకాలం కొనసాగదు**

యువ జనాభా సానుకూలత భారత్‌కి యూపీయే ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైనా, అప్పట్లో వృద్ధి రేటు కూడా రికార్డు స్థాయికి చేరుకున్నా ఉపాధి ఆధారిత అభివృద్ధి గురించిన దృష్టి కరువవటం వల్ల దేశం పెద్ద మూల్యం చెల్లించింది. ఈ వైఫల్యాన్ని ఆ తర్వాత నరేంద్ర మోదీ నేతృత్వంలో వచ్చిన ఎన్‌డీయే ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. చెప్పాలంటే, పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా తయారైంది. ఎన్‌డీయే ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు 20 శాతంగా ఉన్న నిరుద్యోగం ఇప్పుడు 28 శాతం దాటి పెరిగింది. ఆదాయపరంగా కాస్త చెప్పుకోదగిన 49 దేశాల గణాంకాలను ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) స్థూలంగా అధ్యయనం చేస్తే, పైన పేర్కొన్న కీలకాంశాలకు సంబంధించిన అన్ని విభాగాల్లోనూ భారతదేశం చివరి ఐదు దేశాల్లో ఉంది. రాజ్యం చేయాల్సిన ఈ పనుల్లో మన ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. అందువల్లే మన దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్నాయి అనుకున్న ప్రాంతాల్లో కూడా నిరుద్యోగం తీవ్రంగా ఉంది. ఇటీవలి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు పోటాపోటీగా ఉద్యోగ హామీల్ని గుప్పించటానికి కారణమిదే. మన కంటే తక్కువ వృద్ధి రేటు ఉన్న అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ఉద్యోగాల కల్పన అధికంగా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో అయిదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించినా, తలసరి ఆదాయంలో 197 దేశాల్లో 142వ స్థానంలో ఉందని, మూడు నాలుగేళ్లలో మన దేశం 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా కూడా తలసరి ఆదాయం 3,500 డాలర్ల స్థాయిని మించదని మనం గుర్తించాలి. కాబట్టి సరైన పునాది లేని ఆర్థిక వృద్ధిని చూసి ఎల్లకాలం కొనసాగుతుందని మురిసిపోవటం ప్రమాదం.

యువ జనాభా అత్యధికంగా ఉండటం వల్ల కలిగే లాభం తాత్కాలిక ఆర్థిక వెలుగుగా మిగిలిపోకూడదంటే, సుస్థిరాభివృద్ధిగా మారాలంటే మనం దీర్ఘకాలిక దృష్టితో, భవిష్యత్ భారత అవసరాల దృష్టితో ఈ దిద్దుబాట్లను తీసుకురావాలి. పర్యావరణహిత మౌలిక వసతులు, కార్మిక చట్టాలు ఇతర అవసరమైన చోట్లా సరళీకరణలు, నూతన ఆవిష్కరణలు, ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు వంటి మార్గాల్లో పెట్టుబడుల్ని ఆకర్షిస్తూ, ఎగుమతుల్ని పెంచుతూ, వృద్ధి కోసం కృషి చేస్తూనే.. శ్రీలంక తరహా పరిస్థితులు తలెత్తకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. ఉచితాలు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయటం, కొద్దిశాతం మాత్రమే ఉన్న సంఘటిత రంగంలోనివారి ఒత్తిడికి తలొగ్గి మెజారిటీగా పాత పెన్షన్ విధానం పునరుద్ధరించటం వంటి తాత్కాలిక ధోరణులతో అసంఘటిత రంగంలోని కోట్లాది ప్రజల ఆదాయాలు, యువత, పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడకూడదు. ఆర్థికంగా ఎదుగుతూనే విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక స్వపరిపాలన, వ్యవసాయం, పట్టణీకరణ, ఎన్నికల విధానాల్లో, అమలులో మౌలిక మార్పులు తెచ్చుకోవాలి.. ఈ మేరకు సాధించినా ఈవేళు న్న సాంకేతికత పరిజ్ఞానం వల్ల మనకున్న వనరుల్లోనే దేశంలోని ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించగలం, అమ్మాయిలు అబ్బాయిలు తేడా లేకుండా యువ శక్తిని పరాధీనత నుంచి బయటపడేసి నాణ్యమైన సంఘటిత రంగ ఉపాధి అవకాశాలతో సమాజ సంపదగా రూపొందించగలం. నిజానికి పర్యావరణహితంగా ఈ భూమ్మీద అందరికీ తగిన సౌకర్యాలు కల్పించాలంటే కేవలం 300 కోట్ల జనాభా ఉంటేనే సాధ్యమన్న అంచనా ఉన్నప్పటికీ, ఈవేళున్న సాంకేతికతల వల్ల ఇప్పుడున్న జనాభా అంతటికీ ఎదిగే అవకాశాల్ని, సౌకర్యాల్ని అందించవచ్చు. మానవాళి చరిత్రలోనే ఎన్నడూ లేనిరీతి అద్భుత మార్పులకకాలంలోకి అడుగుపెడుతున్న ఈ అపురూప సమయంలో, కుటుంబ విలువలు, మధ్యేమార్గం, పొదుపు వంటి పారంపరిక బలాల్ని కాపాడుకుంటూనే మనం సర్వశక్తులతో అమలు చేయాల్సిన ఎజెండా ఇదే.

**ఆర్థిక చైనానూ అధిగమించే అవకాశం**

ఈ చర్యలు లేకుంటే 2047 తర్వాత యూత్ అడ్వాంటేజ్ తగ్గి వృద్ధుల సంఖ్య పెరుగుతుంటుంది (2061 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 42.5 కోట్లకు చేరుతుందని అంచనా). అందుకే వ్యవసాయ చట్టాల విషయంలో వ్యవహరించినట్లు కాకుండా ఈ లక్ష్యాల కోసం చిత్తశుద్ధితో, సరైన ప్రమాణాలతో మన చర్చలు, చర్యలు ఉండాలి. నాయకత్వం అందరినీ ఒప్పించి ఫలితాల్ని సాధించే చాతుర్యాన్ని ప్రదర్శించాలి. వీటిలో చాలావరకు సులభంగా, వెంటనే చేయగలిగినవి.

ఈ మార్పులు తీసుకొస్తే, చైనాతో పోలిస్తే మన దేశ ప్రజానీకం సగటు వయసు 11 ఏళ్లు తక్కువగా ఉండటం అనే

## జగన్‌ని చూసి ఓటేశా..
## అందుకే ఊళ్లో నీటి సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రిపైనే కేసు పెడుతున్నా

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఈ ఉదంతం కేంద్రీకృత పాలన, పార్టీల నియంతృత్వం వల్ల దుష్పరిణామాలకు నిలువెత్తు నిదర్శనం. ఇక్కడి వీరాయిపాలెం అనే గ్రామంలో 500 మందికిపైగా జీవనం సాగిస్తున్నారు. గ్రామం మొత్తానికి ఒకటే బోరు ఉండటంతో నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి. ఎన్నిసార్లు విన్నవించినా స్థానిక యంత్రాంగం పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన బూసా తిరిపాలు అనే గ్రామస్తుడు ముఖ్యమంత్రిపై కేసు పెడితేనే సమస్య పరిష్కారమవుతుందని భావించాడు. వెంటనే కొంతమంది గ్రామస్తులతో సంతకాలు తీసుకుని కేసు పెట్టేందుకు యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. ఎస్ఐ అందుబాటులో లేకపోవటంతో అక్కడున్న కానిస్టేబుల్‌కు విషయం వివరించాడు. వాగ్వాదం చోటుచేసుకుని కానిస్టేబుల్ బెల్టుతో చితకబాదటంతో తిరిపాలుకి గాయాలయ్యాయి. అయినా జంకకుండా తన గొంతు వినిపించాడు. తాను జగన్‌ని చూసి ఓటేశానని, సమస్యలు ఆయన కాకపోతే మరెవరు తీరుస్తారని తిరిపాలు నిలదీశాడు.

సానుకూలతను పూర్తిగా సద్వినియోగం చేసుకుని జీడీపీకి ఏటా 400 బిలియన్ డాలర్లను జోడిస్తూ జనాభాలోనే కాకుండా ఆర్థికంలో కూడా చైనాకు దీటుగా ఎదగగలం, తలసరి ఆదాయం 13-14,000 డాలర్ల దాకా పెంచుకోగలం.

వాస్తవానికి చైనా ఇవే పనులు చేసింది. యువతపై పెట్టుబడి పెట్టి 10% వృద్ధిని ముప్పై ఏళ్లపాటు సాధించింది. ఇప్పుడు భారత్ కూడా 6-8% దాకా వృద్ధి రేటును అలా కనీసం పాతికేళ్లపాటు నిరాఘాటంగా సాధించాలి. ప్రపంచ పరిస్థితులు కొంత ప్రతికూలంగా ఉన్నా భారత్‌కు ఈ స్థాయి వృద్ధి అవకాశాలున్నాయి, అనుభవం ఉంది. కొందరు ఆర్థికవేత్తలు భారత్‌కి ఉత్పత్తి రంగం ఈ దశలో అక్కర్లేదని చెబుతున్నప్పటికీ, మనకున్న జనాభా, వైవిధ్యం రీత్యా చైనా తరహాలో సేవారంగంతోపాటు ఉత్పత్తి రంగాన్ని కూడా భారత్ ప్రోత్సహిస్తూ యువతకు ఇబ్బడిముబ్బడిగా 'నాణ్యమైన' ఉపాధి అవకాశాల్ని అందుబాటులోకి తేవాలి. కొవిడ్ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ పరిస్థితులు కూడా మనకు అనుకూలంగా ఉన్నాయి.


ఎంత నియంతృత్వ దేశమైనా చైనా అభివృద్ధి కోసం తనను తాను సరిచేసుకుని ఆయా రంగాల్లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించింది. సరళీకరణ విధానాలతో ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాల్ని పటిష్ఠం చేసుకుంది. రాజకీయ స్వేచ్ఛకి, ఆర్థిక స్వేచ్ఛకి వైరుధ్యం ఉండదు కాబట్టి ప్రజాస్వామ్యం భారత్ వృద్ధికి చోదక శక్తి అవుతుంది. మెరుగైన ప్రజాస్వామ్యం, ఇప్పుడున్న సాంకేతికతలు, అంతర్జాతీయ పరిస్థితులు, భారత్‌కి ప్రపంచ దేశాల్లో, కూటముల్లో పెరుగుతున్న ప్రాధాన్యత వంటివి యువ భారత్‌కు యువ చైనా కంటే కొన్ని రకాలుగా అదనపు సానుకూల అవకాశాల్ని కూడా అందిస్తున్నాయి. కావలసిందల్లా ప్రజల బాధ్యతల గురించి ఉపన్యాసాలతో కాలయాపన చేయకుండా, తాత్కాలిక ధోరణులపై రాజకీయ పెట్టుబడిని వృథా చేయకుండా.. గత తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని పరిణామాలను కాస్త ముందుచూపుతో అవగాహన చేసుకుని భారత్ సామర్థ్యాన్ని వెలికితీయగల సంకల్పాన్ని, నాయకత్వ చొరవను ప్రదర్శించటమే. అలా చేయగలిగినప్పుడే మలేరియా నిర్మూలన నుంచి.. చైనాను నిలువరించటం వరకు ఎన్నో సమస్యల్ని పరిష్కరించుకోగలం. యువత చేయిజాచి అర్థించేవారుగా మిగిలిపోకుండా, 'యువ లాభం' యువ భారం కాకుండా కాచుకోగలం. ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందిస్తూ నివారించదగ్గ బాధల్ని తొలగించుకోగలం, అవగాహనతో సొంత ఆలోచనలు చేయగల క్రియాశీల పౌరుల భాగస్వామ్యంతో సుస్థిరాభివృద్ధి, వైవిధ్యం, శాంతి సామరస్యలతో అంతర్జాతీయ సమాజానికి ఆదర్శంగా నిలిచే అగ్రస్థాయి భారతదేశాన్ని నిర్మించుకోగలం.

ప్రపంచంలోనే అత్యధిక జనాభా, అత్యధిక యువ జనాభా కలిగి వందేళ్ల భారతానికి సన్నద్ధమవుతున్న అమృత కాలంలో, నూతన సంవత్సరంలో, వివేకానంద స్ఫూర్తితో ఆయన పుట్టిన రోజున జరుపుకుంటున్న జాతీయ యువజన దినోత్సవ సందర్భంలో ఈ ఎజెండా భవిష్యత్ భారతానికి మన తక్షణ కార్యాచరణ కావాలి.

## అవినీతికి పాల్పడను .. అవినీతిని ప్రోత్సహించను

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా బొబ్బిలిలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా బాధ్యుడు ఆకుల దామోదరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని నిర్మూలిస్తే ప్రజలకు తాయిలాల కన్నా అనేక రెట్లు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి ఆఫీసులో సిటిజన్ చార్టర్లను అమలు చేయాలన్నారు. 'నేను అవినీతికి పాల్పడను, నేను అవినీతిని ప్రోత్సహించను.. దేశాన్ని, రాష్ట్రాన్ని అవినీతిరహితంగా ఉంచేందుకు నేను సైతం ముందుంటాను, అవినీతి అంతమయ్యేందుకు చేసే అన్ని ప్రయత్నాల్లో భాగస్వామిగా ఉంటాను' అని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-1




### మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

బ్రిటన్ రెండో ప్రపంచ యుద్ధంతో తీవ్రంగా నష్టపోయిన పరిస్థితుల్లోనే ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని ఎటువంటి జేబుఖర్చు లేకుండా అందించేందుకు 1948, జులై 5న సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని (NHS) ప్రవేశపెట్టింది. స్వతంత్రం వచ్చిన సమయంలో మనం జారవిడిచిన ఆ అవకాశాన్ని ఇప్పటికీ అందుకోలేకపోయాం. ఫలితంగా మన దేశంలో ఏటా.. ప్రతి లక్ష జనాభాకీ దాదాపు 35,000–40,000 ఆరోగ్య సంవత్సరాలను కోల్పోతున్నాం. ఐదేళ్లలోపు చిన్నారులు ఏడున్నర లక్షలకు పైగా నివారించదగ్గ మరణాలబారిన పడుతున్నారు. ప్రాథమిక వైద్యం సరిగా అందక వ్యాధుల్ని ముదరబెట్టుకుంటూ లక్షల మంది అకాల మరణాల పాలవుతున్నారు, శక్తిసామర్థ్యాల్ని, ఉపాధిని కోల్పోతున్నారు.

### FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఆనాటి బ్రిటన్ కంటే ఈవేళ భారత్‌కి ఎన్నో రెట్లు మెరుగ్గా ఉన్న అవకాశాల్ని ఉపయోగించి మన దేశంలో ప్రజలందరికీ జేబుఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యాన్ని ప్రాథమిక స్థాయి నుండీ అందించేందుకు 'ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ'తో ఏర్పాట్లు.

Read details at www.fdrindia.org

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-2

### మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ఆరోగ్య మౌలిక వసతుల్లో 60 శాతానికి పైగా ప్రైవేటు రంగంలోనే ఉన్నాయి. దీంతో ఆరోగ్యం కోసం చేసే వ్యయంలో 75 శాతాన్ని ప్రజలు సొంతంగా చెల్లించాల్సి వస్తోంది. రోజువారీ ఖర్చుల భారం సంపన్నుల కంటే పేదలపైనే ఎక్కువగా ఉంటుంది. అందుకే అనారోగ్యం వస్తే, జేబుల్లో నుంచి చేస్తున్న ఖర్చు, ఆదాయాన్ని కోల్పోవటం.. పేద, మధ్యతరగతి వర్గాలనే ఎక్కువగా నష్టపరుస్తోంది. ఇంత ప్రయివేటు వ్యయం ప్రపంచంలో ఏ పెద్ద దేశంలోనూ కనిపించదు. కేవలం అనారోగ్యం వల్ల మన దేశంలో ఏటా సుమారు 6 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోతున్నారు. వీరిలో తెలంగాణ నుండి 19 లక్షలు, ఆంధ్రప్రదేశ్ నుండి 26 లక్షలు ఉన్నారు.

### FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ప్రాథమికం నుండి తృతీయ స్థాయి ఆస్పత్రి వైద్యం వరకూ నాణ్యమైన ఆరోగ్య సేవలకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుంది. ఎటువంటి వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అన్ని వర్గాల ప్రజలకూ ఈ సేవలు అందుతాయి. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆరోగ్య విధానాన్ని అమలు చేస్తే ప్రభుత్వాలు ఇంకేమీ చేయకపోయినా కొన్నేళ్లలోనే పేదరికం అంతమవుతుంది.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-3

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ప్రజలు, మీడియా, ప్రభుత్వాలు కోవిడ్‌ను మెరుగ్గా ఎదుర్కొన్నా కూడా.. మన ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం వల్ల కరోనా సంక్షోభం లక్షల మంది అకాల మరణాలకు కారణమైంది, కోట్లాది జీవితాల్ని అల్లకల్లోలం చేసింది.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఆస్పత్రి దాకా వెళ్లాల్సిన అవసరం లేకుండా అంటువ్యాధులను కట్టడి చేసే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుంది. ఆస్పత్రిలో చేరాల్సిన అవసరమొస్తే గందరగోళ పడాల్సిన పనిలేకుండా.. నివారణ, ప్రాథమిక వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టరే అన్నీ చూసుకుంటారు. వైద్య వివరాలు కూడా రికార్డుల్లో సక్రమంగా నమోదవుతాయి.



# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-4

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:


మన దేశంలో జీవనశైలి వ్యాధులు అంటువ్యాధుల్ని మించి పెరుగుతున్నాయి. అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి వాటి వల్లే 72 శాతం పైగా మరణాలు సంభవిస్తున్నాయి.

యూనియన్ ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం, దేశ పట్టణ ప్రజల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు, గ్రామీణుల్లో ప్రతి నలుగురిలో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల్లో 10 మందిలో ఒకరు, పట్టణాల్లో అయిదుగురిలో ఒకరు మాత్రమే రక్తపోటును నియంత్రణలో ఉంచుకుంటున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం, తెలంగాణలో 28.75 శాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. మహిళల్లో సగటు 26.1 శాతం కాగా, పురుషుల్లో 31.4 శాతం.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో 90 లక్షల మందికి నిర్వహించిన వైద్యపరీక్షల్లో దాదాపు 13 లక్షల మందికి అధిక రక్తపోటు ఉందని వెల్లడైంది. హైదరాబాద్‌లో 9 వేల మందికి చేసిన శాంపిల్ పరీక్షల్లో 40.7% మందికి అధిక రక్తపోటు, మరో 39.8 శాతం మందికి ప్రీ హైపర్ టెన్షన్ ఉన్నట్లు తేలింది. కొవిడ్ తదనంతర కాలంలో ఈ వ్యాధులు మరింత పెరుగుతాయని, మరిన్ని మహమ్మారులు కూడా వచ్చే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధుల్ని ఈ విధానంలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థతో సమర్థవంతంగా నియంత్రించవచ్చు. ఆ వ్యాధుల బారినపడకుండా ముందు జాగ్రత్తలు పాటించేలా చేయటానికి, వ్యాధులకు గురైనట్లయితే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసి తొలిదశలోనే గుర్తించి, మందులు వాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ఫ్యామిలీ ఫిజీషియన్ పద్ధతి ఎంతగానో ఉపకరిస్తుంది.




# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-5

### మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ఆరోగ్యంపై మన ప్రభుత్వాల ఖర్చు తక్కువగా ఉండటంతోపాటు, ఆ చేస్తున్న ఖర్చును కూడా సరైన రీతిలో చేయకపోవటం వల్ల.. ప్రజలకు తాత్కాలికంగా ఉపశమనం తప్ప అనారోగ్య భారం నుండి తేరుకోలేకపోతున్నారు. నివారణ, ప్రాథమిక వైద్యానికి కాకుండా.. ఆస్పత్రి చికిత్సలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఆస్పత్రి వైద్యంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో నిరుపేద వర్గ జనాభాకు కేవలం 10% వనరులు దక్కుతుండగా, అత్యంత సంపన్న వర్గాలకు దాదాపు 33% లభిస్తున్నాయి. అంటే, చికిత్సలో జనాభాలోని 20 శాతం అత్యంత పేదలపై వెచ్చించే ప్రతి రూపాయికీ, జనాభాలో 20 శాతం అత్యంత సంపన్నులకు మూడు రూపాయల వనరులు లభిస్తున్నాయి.

### FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

నివారణ, ప్రాథమిక వైద్యం సాధారణంగా పేదలకు అనుకూలంగా ఉంటుందని, జబ్బు వచ్చాక చికిత్సా విధానం సంపన్నులకి అనుకూలంగా ఉంటుందని అనుభవాలు చెబుతున్నందున.. ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో పటిష్ఠ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ఏర్పాటు.

Read details at www.fdrindia.org

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-6

### మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

సాధారణ జ్వరం వచ్చినా, ఏ చిన్న జబ్బు వచ్చినా పేదలయితే పెద్దాస్పత్రికి పరిగెడుతున్నారు. గాంధీ, ఉస్మానియా వంటి ఆస్పత్రుల్లో రోజుకి మూడు నాలుగు వేల మంది ఔట్‌పేషెంట్ (OP) కోసం వస్తుండగా, ఢిల్లీ ఎయిమ్స్‌లో ఆ సంఖ్య 12,000కి పైగా ఉంటోంది. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఆస్పత్రిలో ఇంత ఓపీ ఉండదు. కాస్త మధ్యతరగతి వారయితే, చుట్టుపక్కల స్పెషలిస్టుల వద్దకు వెళ్తున్నారు.

### FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఆరోగ్య సమస్య తలెత్తగానే పెద్దాస్పత్రికో, స్పెషలిస్టు వద్దకో వెళ్లనక్కర్లేదు. దగ్గర్లోని ఫ్యామిలీ డాక్టర్ వద్దకు వెళ్తే చాలు. ఈ సేవలు ఉచితం. ఒక్కో రోగి చెకప్‌కి ఇంతని ప్రభుత్వమే డాక్టర్‌కి చెల్లిస్తుంది. 80 శాతం ఆరోగ్య సమస్యలు ఇక్కడే పరిష్కారమవుతాయి. ఆస్పత్రి సేవలు అవసరమైతే ఫ్యామిలీ డాక్టరే సూచిస్తారు, అందుకు ఏర్పాట్లను కూడా సమన్వయం చేస్తారు.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-7

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ఆరోగ్య రంగంలో ప్రజలు చేస్తున్న జేబుఖర్చులో ఔట్‌పేషెంట్ సేవల వాటాయే అధికంగా ఉంది (జేబుఖర్చు నుండి ఔట్‌పేషెంట్ సేవలను తొలగించి లెక్కేసినప్పుడు పేదల సంఖ్య గణనీయంగా 0.53 శాతానికి పడిపోయింది).

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఔట్‌పేషెంట్ సేవలు పూర్తిగా ఉచితం, ఫ్యామిలీ డాక్టర్ వద్దకే పరిమితం. రెండో స్థాయి, మూడో స్థాయి ఆస్పత్రుల సేవలు కేవలం ఇన్‌పేషెంట్లకి, అది కూడా ఫ్యామిలీ డాక్టర్ నుండి సిఫారు (రెఫరల్)తోనే సాధ్యం.



# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-8

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

వైద్యులు గ్రామీణ ప్రాంతాలకి వెళ్లటం లేదు. చాలామంది వైద్యులు రోగిని పరీక్షించకుండానే మందులిస్తున్నారు. తెలిసిన డాక్టర్‌కి చూపించుకోవాలంటే, ఎక్కడో దూరంగా ఉన్న నగరానికి వెళ్లాల్సి వస్తోంది. అందుకయ్యే రవాణా, వసతి వగైరా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

గ్రామాలకు కేవలం 5-6 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉండే చిన్న పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యాన్ని అందించే ఫ్యామిలీ డాక్టర్లు అందుబాటులో ఉంటారు. ప్రభుత్వం చెప్పిన డాక్టర్ వద్దకే వెళ్లనక్కర్లేదు. నచ్చిన ఫ్యామిలీ డాక్టర్‌ని ఎంచుకోవచ్చు. ఈ పట్టణ ప్రాంతాల జనాభా 1 లక్ష, లక్షన్నర ఉంటుంది. అంటే ప్రతి 15,000 మందికి ఒక ఫ్యామిలీ డాక్టర్ ఉంటారు. రోగి వ్యాధిని ముదరబెట్టుకోవాల్సిన అవసరం లేకుండా దీర్ఘకాలిక అనుబంధం ఉండేలా.. 'వ్యక్తి ప్రధానంగా' ఫ్యామిలీ డాక్టర్ సేవలందిస్తారు. చెకప్‌కి తగిన సమయమిస్తూ ఒక్కో డాక్టర్ రోజుకు 40-50 మంది రోగులను చూస్తారు. డాక్టర్‌తో రోగి సంప్రదింపు శాతాన్ని ఇప్పుడున్న 0.6 శాతం నుండి 1.5 శాతం వార్షిక తలసరికి పెంచటం లక్ష్యం.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-9

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయటానికి వైద్యులు సుముఖంగా లేరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకూ ఇదే పరిస్థితి.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ప్రాథమిక స్థాయిలో పనిచేసే డాక్టర్‌కు నెలకు కనీసం రూ.లక్ష ఆదాయం వస్తుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్వహణ, అద్దెలు అన్నీ పోగా ఈ ఆకర్షణీయ ఆదాయం వస్తుంది. వీరు ప్రభుత్వోద్యోగులు కూడా కాదు. జీతాల పద్ధతిలో కాకుండా.. రోగుల సంఖ్యను బట్టి మాత్రమే వీరికి ప్రభుత్వం చెల్లిస్తుంది. నాణ్యమైన వైద్యం అందించి ఎంత ఎక్కువమంది రోగులను ఆకట్టుకుంటే అంత ఎక్కువ ఆదాయం వస్తుంది. ఇలా డాక్టర్ల మధ్య పోటీ, ప్రజలకు ఎంపిక స్వేచ్ఛ ఉంటాయి.

అలాగే ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో కూడా ప్రయివేటు రంగంలోని స్పెషలిస్టులు వచ్చి పనిచేసేలా, వారికీ ఆకర్షణీయ ఆదాయం వచ్చేలా.. సేవకు–ఫీజు, ప్రత్యేక బ్లాకుల నిర్మాణం, స్వతంత్ర ప్రతిపత్తి వంటి ఏర్పాట్లు ఉంటాయి.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-10

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలను కొంతమందికే పరిమితం చేశారు.



## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లను కేవలం ద్వితీయ స్థాయి వైద్యానికి పరిమితం చేసి, ఆదాయపరిమితి లేకుండా అందరికీ విస్తరిస్తారు. దీనివల్ల గొంతున్నవారు కూడా భాగస్వాములవుతూ ఆ స్కీములు సక్రమంగా అమలవుతాయి.

**Read details at www.fdrindia.org**

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-11


## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

పెద్ద నగరాల్లో భారీ పెట్టుబడుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు వచ్చాక పట్టణాల్లోని చిన్న నర్సింగ్ హోంలు ప్రాధాన్యత కోల్పోయాయి. గతంలో ఈ నర్సింగ్ హోంల వల్ల ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందేది.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

చిన్న నర్సింగ్ హోంలను ప్రభుత్వ ద్వితీయ స్థాయి వైద్యంలో భాగం చేస్తారు. ప్రభుత్వం చెల్లించే బీమా కార్యక్రమాలు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లను వీటితో అనుసంధానిస్తారు. దీనివల్ల నాణ్యమైన రెండో దశ వైద్యాన్ని తక్కువ ఖర్చుతోనే చిన్న పట్టణాల్లో అందరికీ అందించవచ్చు. కనీసం 30 పడకలు గల అటువంటి నర్సింగ్ హోంలు ఆంధ్రప్రదేశ్‌లో 600కి పైగా ఉండగా, తెలంగాణలో 1000కి పైగా ఉన్నాయి. ప్రయివేటు నర్సింగ్ హోంలతో, ప్రభుత్వ సీహెచ్‌సీలు పోటీ పడతాయి.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-12




## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి సామాజిక ఇన్సూరెన్స్ పథకాలను మూడో దశ వైద్యానికి కూడా వర్తింప చేయటం వల్ల ఏటా ఖజానా మీద భారం పెరిగిపోతోంది. దీంతో ఆరోగ్య సంక్షోభం పెరుగుతోంది తప్ప మన దేశంలో తగ్గటం లేదు. ప్రజలకు ఆస్పత్రి ఖర్చు తగ్గినట్లు కనిపిస్తోంది తప్ప ఆరోగ్యం మాత్రం అందటం లేదు.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

సంక్లిష్ట వైద్యం, శస్త్ర చికిత్సలతో నిరంతరం ఖర్చు పెరిగే మూడో దశ వైద్యంలో ఇన్సూరెన్స్ ద్వారా ప్రయివేటు వైద్యం అందించటం చివరికి ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేస్తుంది. దీనికి ప్రాథమిక వైద్యం మూల్యం చెల్లిస్తుంది, అలాగే 90 శాతానికిపైగా అసంఘటిత రంగంలో పనిచేస్తుండటం వల్ల మన దేశంలో ప్రయివేటు ఇన్సూరెన్స్ తీసుకున్నవారు 4% మాత్రమే. కాబట్టి, తృతీయ స్థాయి వైద్యంలో ఇన్సూరెన్స్ ప్రమేయం లేకుండా పూర్తిగా ఆధునీకరించిన ప్రభుత్వాస్పత్రుల్లోనే వైద్యం.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-13

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ప్రభుత్వాస్పత్రికి వెళ్లినా కొన్ని పరీక్షలకి, మందులకి ప్రజలు జేబులో నుండి ఖర్చు చేయకతప్పటం లేదు. ఔట్‌పేషెంట్ సేవల్లో 60% మందుల కోసమే అవుతోంది. ప్రభుత్వ తృతీయస్థాయి ఆస్పత్రిలో చేరిన ప్రతిసారీ రోగులు రూ.4,500 జేబుఖర్చు భరిస్తున్నారు.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఔట్‌పేషెంట్ సేవలందించే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ నుండి మూడో దశ వైద్యం వరకూ అన్ని స్థాయిల్లో వైద్య పరీక్షలూ, అన్ని రకాల మందులూ అందుబాటు, ఉచితం. ప్రతి ఫ్యామిలీ వైద్యుల కేంద్రంలో ఒక డయాగ్నోస్టిక్ ల్యాబ్, ఔషధాల డిస్పెన్సరీ ఉంటాయి. ఉన్నతస్థాయి పరీక్షల కోసం శాంపిల్స్‌ని సేకరించి వసతులున్న పట్టణాలకి పంపి వేగంగా ఫలితాలను అందిస్తారు.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-14

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

తృతీయ స్థాయి వైద్యాన్ని అందించే ప్రభుత్వాస్పత్రులు అత్యధికం అధ్వాన్నంగా, గలీజుగా ఉన్నాయి. నిత్యం ఔట్‌పేషెంట్లతో కిటకిటలాడుతుంటాయి. పడకలు లభించవు,

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఔట్‌పేషెంట్ సేవలు ప్రాథమిక స్థాయిలోని ఫ్యామిలీ డాక్టర్ వద్దకే పరిమితం, తృతీయ స్థాయి ఆస్పత్రికి రావాలంటే ఫ్యామిలీ డాక్టరో, రెండో దశ చికిత్స అందించే డాక్టరో సిఫార్సు చేయాలి కాబట్టి.. రద్దీ ఉండదు. ఇక సేవలకు సంబంధించి, ప్రభుత్వ తృతీయ స్థాయిలో వనరులు తక్కువున్నా రూపాయికి రూ.4 పని జరుగుతోందని తేలింది. అందువల్ల ఒక్కో బెడ్‌కి ఏడాదికి రూ. 1 కోటి నుండి 2 కోట్ల దాకా ఖర్చు చేసే కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో సేవలందించేందుకు.. ఒక్కో పడక వ్యయాన్ని ఇప్పుడున్న రూ.8 లక్షల నుండి దశలవారీగా రూ.20-25 లక్షలకు పెంచుతారు. టయర్ 1 ఆస్పత్రుల్లోని 1,40,000 పడకల్ని, టయర్ 2 ఆస్పత్రుల్లోని 1,47,000 పడకల్ని ఈ రకంగా అప్‌గ్రేడ్ చేస్తారు.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-15

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న డాక్టర్లు కూడా రోగులకు అందుబాటులో ఉండటం లేదు. హాజరు తప్ప సేవలు లేవు. అత్యాధునిక పరికరాలను సైతం మూలన పడేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వాస్పత్రుల్లో ఉన్న కొన్ని మందుల్ని కూడా ప్రజలకు ఇవ్వకుండా కాలం తీరాక పారబోస్తున్నారు.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

వీలున్నంత మేర పోటీకి అవకాశం, ప్రశ్నించే గొంతుకలుండేలా పథకాన్ని అందరికీ వర్తింప చేయటం వంటి ఏర్పాట్లతోపాటు.. పకడ్బందీ పర్యవేక్షణ వ్యవస్థ ఉంటుంది. రోగ నిర్ధారణ పరీక్షల ల్యాబ్‌లు, మందుల దుకాణాలు సహా ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను సి.హెచ్.సి స్థాయిలోని ప్రాంతీయ ఆరోగ్య బోర్డు పర్యవేక్షిస్తుంది. రెండో అంచెలో జిల్లా ఆరోగ్య బోర్డులుంటాయి. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా ఉండే రాష్ట్ర ఆరోగ్య బోర్డు, జాతీయ స్థాయిలో ఫెడరల్ ఆరోగ్య పర్యవేక్షణ ఏజన్సీ ఉంటాయి.

**Read details at www.fdrindia.org**


# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-16

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:

గ్రామీణ భారతదేశంలో 70 శాతం ప్రాథమిక ఆరోగ్య సేవలు అనధికార ఆరోగ్యసేవలదారుల (RHP) ద్వారానే జరుగుతున్నాయి. దీనివల్ల ప్రజలకు సరైన వైద్యం అందటం లేదు, కొన్ని సందర్భాల్లో ప్రాణాల మీదకు వస్తోంది.

## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం:

ఆర్‌హెచ్‌పీలను కొనసాగిస్తారు. అయితే, సొంతంగా కాకుండా.. ఫ్యామిలీ డాక్టర్లుగా ఉండే శిక్షణ పొందిన ఎంబీబీఎస్ డాక్టర్ల ఆధ్వర్యంలో వీరు పనిచేస్తారు. ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని ఎక్కువగా వినియోగించుకునేలా వీరు తమకున్న విస్తృత పరిచయాల్ని వినియోగిస్తారు.



# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-17

**అపోహ :**

మన దేశంలో డాక్టర్లకు కొరత ఉంది. అందువల్ల పెద్దఎత్తున తయారుచేయటానికి జిల్లాకో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి.

**వాస్తవం (FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలో భాగం):**

భారత్‌లో శిక్షణ పొందిన డాక్టర్లకు కొరత లేదు. 13 లక్షలకు పైగా ఉన్నారు. మరోవైపు, ఏటా 80,000 మందికి పైగా వైద్య పట్టభద్రులు కొత్తగా తయారవుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండే ప్రతి సంవత్సరం 9,000–10,000 మంది డాక్టర్‌లు అవుతున్నారు. అలాగే శిక్షణ పొందిన ఎంబీబీఎస్ డాక్టర్లలో 2,50,000 మంది దాకా పెద్ద ఆదాయం లేకుండా ఖాళీగా ఉన్నారు. ఓపక్క ప్రాథమిక వైద్య స్థాయిలో డాక్టర్ల కొరత విపరీతంగా ఉండి ప్రభుత్వ ప్రాథమిక వైద్యంలో కేవలం 4% మందే ఉండగా, ఇంకోపక్క అంతమంది ఎంబీబీఎస్‌లు ఖాళీగా ఉండటం దిగ్భ్రాంతికరం. ఆ వైపరీత్యాన్ని ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆరోగ్య నమూనా సరిచేస్తుంది. ఆకర్షణీయమైన ఆదాయావకాశమున్న ఫ్యామిలీ డాక్టర్లుగా సేవలందించటానికి ఎంబీబీఎస్ పట్టభద్రులకు అవకాశాల్ని కల్పిస్తుంది. వీరికి స్వల్పకాల శిక్షణనిచ్చి ఫ్యామిలీ వైద్యులుగా తీసుకోవచ్చు. కొంతకాలం పనిచేశాక వీరిలో కొందరు సొంత ప్రాక్టీస్ పెట్టుకోవచ్చు లేదా పై చదువులకూ వెళ్లవచ్చు. అప్పుడు కొత్తవారిని అందులోకి తీసుకుంటారు. ఇదో నిరంతర ప్రక్రియ. లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ విధానం అమలుకి ఒక్క ఏడాది మార్కెట్‌లోకి వచ్చే పట్టభద్రులు చాలు. అంటే, మనకు కావలసింది ప్రజలందరికీ ఖర్చులేని నాణ్యమైన వైద్యం తప్ప కొత్త వైద్య కాలేజీలు కాదు.


# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-18

**సందేహం :**


దాదాపు 140 కోట్ల మంది జనాభా ఉన్న మన దేశంలో అందరికీ నాణ్యమైన వైద్యాన్ని ఎటువంటి జేబుఖర్చు లేకుండా అందించటం ఆచరణ సాధ్యమేనా?

**సమాధానం (FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలో భాగం):**

పూర్తిగా ఆచరణ సాధ్యం. ప్రస్తుతం మన జాతీయ ఆదాయంలో 1 శాతానికి కాస్త అటూఇటుగా మాత్రమే ఆరోగ్యానికి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. యుద్ధాలు, కల్లోలాలతో ధ్వంసమైన, ఛిద్రమైన దేశాలను మినహాయిస్తే, భూమ్మీద అన్ని దేశాల్లోకి ఇది అతి తక్కువ వ్యయం. కేటాయింపుల్ని మూడు రెట్లో, నాలుగు రెట్లో పెంచక్కర్లేదు. కేవలం 0.4% అదనంగా కేటాయిస్తే చాలు. మనకున్న మానవ వనరులు, నైపుణ్యాలు, ప్రపంచ స్థాయి ఔషధ పరిశ్రమ, టీకాల ఉత్పత్తి సామర్థ్యం, సాంకేతికత మొదలైన సానుకూలతల వల్ల ఇది సాధ్యమవుతోంది. ఆరోగ్యంపై జి.డి.పిలో భారత్ చేస్తున్న 1.2 శాతం ఖర్చులో కూడా 70 శాతం రాష్ట్రాలు చేస్తుండగా, 30 శాతం యూనియన్ ప్రభుత్వం చేస్తోంది. యూనియన్ ప్రభుత్వం తన వాటాను కొంత పెంచి ఈ విధానం అమలుకి చొరవ చూపాలి.



# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-19



**సందేహం :**

భారత్‌లో ప్రయివేటు రంగంలో పెట్టుబడులు ఉన్నకొద్దీ భారీగా పెరుగుతున్నాయి. 2011లో 94 మిలియన్ అమెరికన్ డాలర్ల నుండి 2016లో 1,275 మిలియన్ డాలర్లకు, 13.5 రెట్లు పెరిగాయి. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆరోగ్య విధానం అమల్లోకి వస్తే ప్రయివేటు రంగం ఉండదా?

**సమాధానం (FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలో భాగం):**

లోక్‌సత్తా ప్రతిపాదించిన ఆరోగ్య విధానం ప్రయివేటు రంగానికి వ్యతిరేకం కాదు. ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో, అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన శస్త్ర చికిత్సల్ని, ఇతర వైద్య సేవల్ని అందిస్తున్నందున విదేశాల నుండి ఇక్కడికొచ్చే రోగుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. భారత మెడికల్ టూరిజం మార్కెట్ వేగంగా పెరుగుతూ కేవలం ఆస్పత్రి సేవల్లోనే 2026కి 13 బిలియన్ డాలర్లకు చేరనుంది. దీంతోపాటు మన దేశంలో కూడా 25-30% మంది ప్రయివేటు వైద్యుల వద్దకే వెళ్తారు. మిగిలిన కోట్లాది సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎటువంటి ఆర్థికభారం లేకుండా మంచి ఆరోగ్యాన్ని పొందే ఏర్పాటు కోసమే లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ఆరోగ్య విధానం.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-20

**సందేహం :**

తెలుగు రాష్ట్రాల బడ్జెట్‌లో లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ఆరోగ్య విధానం అమలు సాధ్యమేనా?

**సమాధానం (FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలో భాగం):**

పూర్తిగా సాధ్యం. రెండు తెలుగు రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కలిపి 4,00,000 కోట్ల పైన ఉంది. బడ్జెట్‌లో ఒక్కో రాష్ట్రం సుమారు 1% అదనంగా కేటాయిస్తే చాలు.. ఈ విధానాన్ని అమలు చేయొచ్చు. తెలంగాణ రూ.1900 కోట్లు, ఏపీ రూ.2600 కోట్లు. రాష్ట్రాల జి.ఎస్.డి.పి (స్థూల ఆదాయం) ప్రకారం చూస్తే, తెలంగాణలో ఖర్చు 0.16%. అంటే 1 శాతంలో ఆరవ వంతు. ఆంధ్రప్రదేశ్‌లో 0.24%. అంటే 1 శాతంలో పావు వంతు. సంక్షేమ పథకాల కోసం దేశంలోనే రికార్డు స్థాయిలో ఖర్చు చేస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అందులో కొద్దిగా ఖర్చు చేస్తే చాలు.. ఎంతోమంది పేదరికం నుండి శాశ్వతంగా బయటపడతారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఈ ఆరోగ్య విధానం అమలుకి నాయకత్వం వహించాలి.

**Read details at www.fdrindia.org**



# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-21


**సందేహం :**

ఎన్నేళ్లలో భారత్‌లో ఈ ఆరోగ్య విధానం అమలు చేయవచ్చు?

**సమాధానం (FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలో భాగం):**

మూడేళ్లలో అమలు చేయవచ్చు. దేశ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే విధానమిది. ఇంత తక్కువ ఖర్చుతో, ఇన్ని కోట్ల మందికి, ఇంత మేలు చేసే కార్యక్రమం ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ రంగంలోనూ లేదు. మూడేళ్ల తర్వాత సమీక్షించుకుని, లోపాలేమైనా ఉంటే సవరించుకుని, చేర్పులు అవసరమైతే చేసుకోవచ్చు. అన్నీ అనుకూలంగా ఉన్నాయి, కొవిడ్ తర్వాత ఆరోగ్యానికి ప్రజల్లో డిమాండ్ కూడా పెరిగింది. రాజకీయ పార్టీలు, నాయకులు, పౌర సమాజం, ప్రజాసంఘాలు, ఆలోచనాపరులు, మీడియా అందరూ పార్టీలకతీతంగా కలసి వేగంగా అమలుకు కృషి చేయటమే కావలసింది. ప్రజలకు మంచి చేసి ఓట్లు సంపాదించుకోవాలనే సంకల్పం ఉండాలేగానీ, ఈ పథకం ద్వారా రాజకీయ పార్టీలకు ఓట్లు కూడా వస్తాయి.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-22



**+ అధికాదాయం కలిగిన దేశాల్లో మెరుగైన ఆర్థిక పరిస్థితులు, వృద్ధాప్య జనాభా పెరుగుతుండటం వల్ల రక్తపోటు, మధుమేహం వంటి అసాంక్రమిక వ్యాధుల (ఎన్.సి.డి) భారం పెరుగుతుండటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ యువ జనాభా అత్యధిక సంఖ్యలో ఉన్న భారత్‌లో కూడా అసాంక్రమిక వ్యాధులు ఎక్కువగా పెరుగుతున్నాయి. నివారణ, ప్రాథమిక ఆరోగ్య సేవలు అథమంగా ఉండటం వల్లే ఇండియాలో ఈ ప్రమాదకర పరిస్థితి.**

**+ భారత్‌లో 25 శాతం ప్రజలు మాత్రమే ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల వద్దకు వెళ్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకైతే రోజుకు సగటున కేవలం 15 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారు.**

**+ సాంక్రమిక, అసాంక్రమిక (అంటు, అంటుకోని).. రెండు రకాల వ్యాధుల వల్ల ప్రజలపై పడే భారం భారత్‌లోనే అత్యధికం. గత 10 ఏళ్లలో మలేరియా 50 శాతం దాకా తగ్గింది. అయితే, ఇదే సమయంలో, క్షయ (టి.బి), డెంగీ వ్యాధులు చెలరేగుతూనే ఉన్నాయి.**

**+ ఆరోగ్యంలో ప్రయివేటీకరణ వల్ల అసమానతలు, అధ్వాన్నమైన ఫలితాలు వస్తాయని అమెరికా అనుభవాలు చెబుతున్నాయి. ఆరోగ్యరంగంలో ప్రపంచంలోనే అత్యధిక వ్యయం (ప్రభుత్వ+ప్రయివేటు) చేస్తున్నా, జీడీపీలో 18 శాతం (తలసరి 10,624 డాలర్లు) ఖర్చు చేస్తున్నా దాదాపు 2.6 కోట్ల మంది అమెరికన్లకు ఆరోగ్య సంరక్షణ అందటం లేదు.**

**+ ప్రయివేటు రంగం కనుసన్నల్లోని ఆరోగ్య సంరక్షణ నమూనాల్లో ఫలితాలతో పొంతన లేకుండా ఖర్చులు ఉన్నకొద్దీ పెరిగిపోతుంటాయి. ఓ ఆధునిక, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అంటే, భారీ స్థాయి వనరులు, నైపుణ్యాలు, అధునాతన సాంకేతికతలు ఉంటాయి. కొత్త సాంకేతికతల్ని కనిపెడుతున్నకొద్దీ, అడ్డూఆపూ లేకుండా ఖర్చు అనివార్యంగా పెరుగుతూంటుంది.**

**+ ఎఫ్‌డీఆర్/ లోక్‌సత్తా విధానం అమలయితే దాదాపు రెండు కోట్ల ఉద్యోగావకాశాలు కొత్తగా వస్తాయి.**

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-23

+ ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించటం ప్రభుత్వాల మౌలిక బాధ్యత.

+ ఆరోగ్యం, ఆర్థిక ప్రగతి కలసికట్టుగా సాగుతాయి. అందువల్ల ఆరోగ్యం.. పాలనలో కీలక విభాగం.

+ ఒక ప్రజాస్వామ్య సమాజంలో రాజకీయాలే అన్నిటికీ కేంద్రబిందువు. మనిషి ఆనందాన్ని పెంపొందించటమే నిజమైన రాజకీయాల లక్ష్యం. ఆనందంలోని ఒక కీలక అంశం ఆరోగ్యం.

+ నాణ్యమైన ఆరోగ్యం, పౌరుని చుట్టూ తిరిగే ప్రజాస్వామ్యం కలగలిసి ఉంటాయి. మెరుగైన ఆరోగ్యం కోసం సంఘర్షణ, ప్రజల సాధికారత కోసం అన్వేషణ, జవాబుదారీతనమున్న ప్రజాస్వామ్యం కోసం పోరాటం, ప్రభుత్వ ధనానికి ఖర్చుకు తగ్గ అత్యుత్తమ విలువ లభించాలనటం.. ఇవన్నీ విడదీయలేని అంశాలు.

+ భారత్‌లో ఒక ఆచరణసాధ్యమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మించి సుస్థిరం చేసుకోవటానికి కృషి చేస్తే.. మన సంపూర్ణ సామర్థ్యానికి తగ్గ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందుకోగలం.

# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-24

**మన దేశంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని కీలక ఏర్పాట్లు:**

**ప్రాథమిక స్థాయిలో –** ప్రజలకు దగ్గరలోనే ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ. అన్ని రకాల ఔట్‌పేషెంట్ సేవలూ ఇక్కడే. వైద్య సేవల మధ్య పోటీ ఉంటుంది. నచ్చిన డాక్టర్‌ని ప్రజలు ఎంపిక చేసుకోవచ్చు. జీతాల పద్ధతిలో కాకుండా రోగికి ఇంత చొప్పున అన్ని సేవలకూ ప్రభుత్వమే డబ్బు చెల్లిస్తుంది. ఆదాయాన్ని పెంచుకోవటానికి రోగులను ఆకట్టుకోవటం కోసం వైద్యుల మధ్య పోటీ, తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉండటం వల్ల నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి. ఆస్పత్రి సేవలు అవసరమైతే సిఫార్సు చేసేందుకు వీలుగా ఫ్యామిలీ డాక్టర్ పైస్థాయితో అనుసంధానమై ఉంటారు.

**రెండో స్థాయిలో –** ఆరోగ్యశ్రీ నమూనాలో కొన్ని మార్పులు చేసి అందరికీ వర్తింప చేయటం, చిన్న నర్సింగ్ హోంల సేవలు.

**మూడో స్థాయిలో –** ఖరీదైన ఈ వైద్యం పూర్తిగా ప్రభుత్వాస్పత్రుల్లోనే. ఆధునిక వైద్య అవసరాలకు అనుగుణంగా జిల్లా, ప్రభుత్వ బోధనాస్పత్రులను దశలవారీగా బలోపేతం చేస్తారు. 'ప్రయివేటులోని నిపుణులు కూడా' వచ్చి ఇక్కడ కొంత సమయం సేవలందించే ఏర్పాట్లు ఉంటాయి. ఎమర్జెన్సీ కేసుల్లో తప్ప ప్రతి చిన్న జబ్బుకీ ఉస్మానియా, గాంధీ, ఎయిమ్స్ వంటి ఆస్పత్రులకు రాకుండా ఔట్‌పేషెంట్ సేవల్ని ఫ్యామిలీ డాక్టర్‌కే పరిమితం చేసే రెఫరల్ పద్ధతి ఉంటుంది కాబట్టి ఆస్పత్రుల్లో రద్దీ ఉండదు.


అన్ని రకాల డాక్టర్ కన్సల్టేషన్లు, వైద్య పరీక్షలు, మందులు ఉచితం. ప్రయివేటుకు వెళ్లాలనుకునేవారు వెళ్లొచ్చు.

అన్ని స్థాయిల్లో జవాబుదారీతనం.




# FDR /లోక్‌సత్తా ఆరోగ్య విధానం ఎందుకు అవసరం-25

## మన ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ సంక్షోభం:




## FDR / లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని పరిష్కారం



# జుగాడ్ ఓటర్ల ఉద్యమం


ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com




ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## ఓట్ జుగాడ్: జనవరి 2023

## ఓటర్లకు కనిపించని నిజాలు - 3

**ప్రశ్న:** రాజ్యాంగంద్వారా స్వతంత్ర ప్రతిపత్తి పొంది, నిస్పాక్షికంగా వ్యవహరించవలసిన జాతీయ ఎన్నికల కమిషన్ ఓటర్ల డబ్బుని పెద్దఎత్తులో దుర్వినియోగం చేస్తున్న కొన్ని పొలిటికల్ పార్టీల యొక్క సంఘటిత వ్యూహాలకు "తెలిసీ-తెలియనట్టు" లొంగిపోయి ప్రవర్తిస్తూ, చట్టబద్ధపాలనకై నిర్దేశించబడిన స్వతంత్ర ప్రతిపత్తి పొందిన న్యాయవ్యవస్థను సహితం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ శాసిస్తూంటే - ఆలోచనాపరులైన IAS లూ, IPSలూ, దాదాపు 14 లక్షలమంది లాయర్లూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులూ, నెలకు రూ. 50,000 పైబడి పెన్షన్ పొందుతున్న విశ్రాంత వయోవృద్ధులూ, సినీరంగ ప్రముఖులూ, మీడియాఓనర్లూ, పదెకరాలు మించిభూమికలిగిన రైతులూ మన ప్రజాస్వామ్యంలో ఓటర్లు కాదా?

జుగాడ్ ఓటరుగా నా సమాధానం: ఖచ్చితంగా వీరందరూ కూడా ఎన్నికలకమిషన్ జారీచేసిన గుర్తింపుకార్డు కలిగి, బాధ్యతారాహిత్యంతో చోద్యంచూస్తున్న ఓటర్లే. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వార్షికాదాయం పదిలక్షలపైబడి ఒక కోటి రూపాయల వరకూ సంపాదన ఉన్నట్టు ప్రకటించుకున్న వారిసంఖ్య 75 లక్షలు. వీరంతా సగటున 3 లక్షల రూపాయలు చొప్పున రాబడిపన్ను సాలీనా, వివక్షరహితంగా కడతారు. రాయితీలుపోగా షుమారు 20లక్షలకోట్ల రూపాయలన్నమాట. (భారత దేశపు వార్షిక బడ్జెట్లో సగం డబ్బు) నేటి "కుటుంబ రాజకీయ పారిశ్రామికవేత్తలు" ఈసమూహాలనుండి ఉద్భవించినవారే.

గతంలో కొన్ని పార్టీలయొక్క కులం-మతం ఆరక్షణలూ (Reservations) ఆత్మగౌరవనినాదాలతో 5లక్షల రూపాయల లోపు వార్షికాదాయమున్న ఎన్నో పేదకుటుంబాలు లబ్ధిపొందినా, నేడు 10లక్షల రూపాయల లోపు వార్షికాదాయమున్న మధ్యతరగతి కుటుంబాలు "పారదర్శకంగా అవినీతిరహిత" సుపరిపాలనకోసం ఎదురుచూస్తున్న ఏకైక "నాఓటు-నాఇష్టం" రాజకీయ పార్టీయే (ప్రతిపాదిత) జుగాడ్ ఓటర్ల ఉద్యమపార్టీ. నమూనా మార్పు (paradigm shift) సంకల్పం ఉన్నవారే జుగాడ్ ఓటర్లు. వారే రాజ్యాధికార సాధనకి తమ కష్టార్జితమైన 2వేల రూపాయలు, లేదా 5వేల రూపాయలు, గరిష్టంగా 10వేలరూపాయలు ఒకేఒకమారు విరాళమిచ్చి తమ పార్టీని విలువలతోకూడిన "నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం" అనే ప్రాతిపదికపై నిర్మించుకుంటారు. జుగాడ్ (అధినేత రహిత) పార్టీకి పేరుఓటర్లే నిర్ణయిస్తారు. జుగాడ్ ఓటర్ల "మెజారిటీ-ఓటు" ప్రకారం పార్టీ నిర్వహించబడుతుంది. "భారతభాగ్య విధాతగా" గుర్తింపబడిన 10వేలరూపాయిల విరాళదాత, పార్టీ నిర్వహణలో నైనా లేదా క్రియాశీలక ఎన్నికలలో నైనా పాల్గొనవచ్చు. రండి! జుగాడ్ ఓటర్ల రాజకీయానికి స్వాగతం పలకండి!

జుగాడ్ఓటరుగా నమోదయిన శ్రీ నారగోని గారికి గౌరవపూర్వక స్వాగతం !

Please contact: (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:

ADVT

# కొత్త రీతి ఉద్యమం.. దేశంలో మార్పుకు దోహదం

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో కటారి శ్రీనివాసరావు ముఖాముఖి (రెండో భాగం)




**కటారి : ప్రజలే ప్రభువులు..పాలకులు సేవకులే, రాజకీయం పవిత్ర వ్యాసంగం ఇలా మీరు ఇచ్చిన నినాదాల్నే ఈ రోజు చాలా మంది వాడుతున్నారు. లోక్‌సత్తా చెప్పిన అంశాల్నే చాలా మంది రాజకీయ నాయకులు ఈ రోజు చెబుతున్నారు. విద్య, వైద్యం గురించి మాట్లాడుతున్నారు. దీనిపై మీ స్పందన?**

**జేపీ:** విద్య, వైద్యాన్ని పూర్తిస్థాయిలో బాగుచేయలేకపోయినా మొట్టమొదటిసారిగా దృష్టి సారించడం మొదలుపెడుతున్నారు. ఇంకా వేగంగా చేస్తే బాగుండేది. ఆంధ్రప్రదేశ్‌లో బైజూస్ అనే ఓ కంపెనీని తీసుకొచ్చారు. అది సరైన మార్గం కావచ్చు..కాకపోవచ్చు. కానీ దారి కరెక్టు. ఊరికే జీతాలు ఇచ్చి టీచర్లను పెడితేనో, పరీక్షలు నిర్వహిస్తేనో, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తేనో చాలదు..ప్రతిభ వికసించడం లేదు..దానికి వేరే మార్గం కావాలనే ఆలోచన మొదలైంది. దాన్ని ఆహ్వానిద్దాం. దాన్ని మరింత సమర్థవంతంగా ఎలా చేయాలనే దాని గురించి తర్వాత ఆలోచిద్దాం. రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ తీసుకొచ్చారు. దానితోనే ఆరోగ్యం రాలేదు కానీ ఆరోగ్యం కోసం బీదలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది..ఆ ఖర్చు లేకుండా చేద్దామనే ఆలోచన వచ్చింది. రాజకీయంలో ఎన్ని లోపాలున్నా...నాయకులు ఎన్ని తప్పులు చేసినా చివరకు జనం గురించి ఆలోచిస్తారు. జనం మీద ప్రేమ ఉన్నా లేకపోయినా కూడా జనం ఆదరణ లేకపోతే మనుగడ లేదు కాబట్టి ఆలోచిస్తారు. అందుకే రాజకీయాన్ని మనం గౌరవించాలి. దాని తప్పులను సరిదిద్దాలి కానీ రాజకీయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామనేది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

**ప్రశ్న: మార్గం అదే లక్ష్యం అదే..అప్పుడప్పుడు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు వాహనాన్ని మారుస్తుంటాం..అని మీరు పదేపదే చెబుతుండేవారు. అలాగే సంస్థ నుంచి రాజకీయ పార్టీగా మారారు. అయితే ఆ వాహనాన్ని వదిలేశారు..ఈ మార్పునకు కారణం ఏంటి?**

**జేపీ :** రాజకీయాన్ని ఎప్పుడూ కూడా తిరస్కరించలేదు. అరవింద్ కేజ్రీవాల్ రాజకీయల్లో చేరితే చెప్పుతో కొట్టండని చెప్పారు. లోక్‌సత్తాగా ఎప్పుడూ అలాంటి భాష మాట్లాడలేదు. రాజకీయం పవిత్ర వ్యాసంగం. పొరపాట్లు ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో అవి సహజం సరిదిద్దాలని చెప్పాం. రాజకీయాలకు మనం సరిపోమని అనుకున్నాం తప్ప రాజకీయంపై చిన్న చూపు ఆనాడు లేదు..ఈనాడు లేదు. రాజకీయ పార్టీలు, అందులోని నాయకులు మంచివారే అయినప్పటికీ ఒక స్థాయిని మించి మౌలిక మార్పునకు సిద్ధంగా ఉండడం లేదు. యథాస్థితి కొనసాగించడం వాళ్లకు బాగుంది.

దేశంలో ఆర్థిక వ్యవస్థ మారుతోంది. పట్టణీకరణ పెరుగుతోంది.

కొద్దిమేర ఆదాయాలు పెరుగుతున్నాయి..యువతలో చదువు, పరిజ్ఞానం పెరుగుతోంది. ఎలక్ట్రానిక్ మీడియా వచ్చింది. ప్రజల్లో ఎంతో కొంత ఆలోచన పెరుగుతోంది. నూటికి పదిమంది అయినా కలిసొచ్చి మేం దీర్ఘకాలం ఈ పార్టీకి ఓటేయాలి అనుకుంటే ఆ పదిశాతం ఓట్లకోసమైనా సంప్రదాయ రాజకీయ పార్టీలు మారాల్సి వస్తుందని నేను నమ్మాను. నగర ప్రాంతల్లో ఎనిమిది నుంచి పది శాతం ఓట్లు వస్తున్నాయి కానీ గ్రామీణ ప్రాంతాల్లో అరశాతం ఓట్లు వస్తున్నాయి. ముంబయిలో ఓ వార్డు గెలిచాం. బెంగళూరులో పోటీ చేశాం. తమిళనాడులో పోటీ చేశాం. ఎక్కడ చూసినా ఒక్కటే అనుభవం కనిపిస్తోంది. గెలుస్తామనే ఆలోచన ఎనాడూ లేదు. కానీ పదిశాతం ఓట్లు వస్తే చాలు కచ్చితంగా వ్యవస్థ మొత్తం మేలుకుంటుంది. ఇంతమంది మార్పును కోరుకుంటున్నారని ఆలోచిస్తారు. కానీ ఆ సంఖ్య కనిపించకపోతే మీ బలం బలహీనత అవుతుంది. వాదనలో బలాన్ని పక్కనపెట్టి.. ప్రజలు ఆదరించడం లేదు కాబట్టి మేం ఎందుకు పట్టించుకోవాలంటారు కాబట్టి ఏ లక్ష్యంతో రాజకీయ పార్టీ పెట్టామో దానికి విరుద్ధంగా ఫలితాలు వస్తాయి. అయితే ఇది అన్ని చోట్ల వర్తించదు. ఉదాహరణకు ఢిల్లీలో కాంగ్రెస్ అంతర్ధానమైపోయింది. పంజాబ్‌లో అకాలీదళ్ తాత్కాలికంగా అంతర్ధానమైపోయింది. కాబట్టి మన ఎన్నికల వ్యవస్థలో రెండో పార్టీగా కనిపించగానే ఓటేసేస్తారు. రెండో పార్టీ కాదనుకుంటే ఓటేయరు. తెలంగాణలో పోరాటం అంతా ఏంటి.. కాంగ్రెస్, బీజేపీ ఎవరు రెండో పార్టీ అనే దానిమీదే యుద్ధం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రభావంతో ఉండేది. ఇవాళ ఆపార్టీ అక్కడ పార్టీ బతికుందా? అయిపోయింది. మనకు ఇక్కడ ఉత్తరాదిలా కాదు. మన పార్టీలు ప్రజల్లో వేళ్లూనుకున్నంతగా ప్రపంచంలో ఎక్కడా చూడరు. గ్రామంలో 50 మంది ఆ పార్టీ, 50 మంది ఈ పార్టీ, ఆ వర్గం..ఈ వర్గం అంటూ ప్రజలతో నిజంగా మమేకం అయ్యారు. ఒక బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ మీద అభిమానం ఉన్నా ఓటు వేస్తయిపోతోంది..ఇంకా దుర్మార్గుడు అధికారంలోకి వస్తాడనే భావనతో అటు వెళ్లిపోతున్నారు. ఇదేదో నైతికమైన సమస్య కాదు. ప్రాక్టికల్ సమస్య. ఈ ప్రాక్టికల్ సమస్య లేకపోతే మనమే కాదు..దేశంలో మార్పు కోరే ఎవరైనా గట్టిగా నిలబడొచ్చు. ఉన్న పార్టీల్లో చేరి స్థాయిని పెంచుకోవచ్చు. ఆ పార్టీలతో పోటీపడి ప్రజల ఆదరణ పొందొచ్చు. రాజ్యాంగబద్ధంగా అది మనకు ఉన్న నైతికమైన హక్కు. కానీ ఏరకంగానూ కూడా ఫలితం రాకుండా నష్టమే కనిపిస్తుంటే.. బలం, పంతం, పట్టుదల ఉన్నాయని తలతో గోడను అదే పనిగా పగలగొట్టే ప్రయత్నం చేస్తే ఎలా... ద్వారం ఎక్కడ ఉందో చూసుకోవాలి.. ఆ తలుపు ఓపెన్ చేసుకోవాలి..కాబట్టి ఇది కేవలం ఎత్తుగడ. దీనిలో రహస్యం ఏమీ లేదు.

**ప్రశ్న : ఓట్లు రాకపోయినా సంస్థాగతంగా ఉన్న వ్యవస్థను ఉపయోగించుకుని కిందిస్థాయి వరకు అజెండాను తీసుకెళ్లే ప్రయత్నం చేయకపోవడం వల్ల నిస్తేజం అలముకుందనే భావన ఉంది?**

**జేపీ :** 25 ఏళ్ల క్రితం రాజకీయ పార్టీలు కానీ ప్రభుత్వం కానీ పౌరసమాజంతో చర్చించడానికి సిద్ధపడ్డారు. మీరొక మాట కనుక విశ్వసనీయంగా చెబితే దానిమీద కొంత ఆలోచన చేసేవారు.. ఈ 25 ఏళ్లలో జరిగిన మార్పు ఏంటంటే..అసలు రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఇదంతా అనవసరం..జనం ఓట్లేస్తారు..మేం అధికారంలో ఉంటాం.. మేం చెబుతాం మీరు నోర్మూసుకోండి..అన్న పరిస్థితి బాగా పెరిగిపోయింది. ఇదే దేశం అంతా వర్తిస్తుంది. సమాజం కంటే రాజ్యం చాలా పెద్దదైపోయింది. నిజానికి రాజ్యం పాత్ర తగ్గాల్సింది. అధికారాన్ని చెలాయించడం..అధికారాన్ని పొందడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. సమాజం రెండు వర్గాలుగా చీలిపోయినప్పుడు మౌలికమైన మార్పు కోసం ఎవరు ఏం చెప్పినా ఆ చెప్పే వ్యక్తి మీద గౌరవం ఉన్నా వినే పరిస్థితి ఉండదు. సమైక్య, ప్రత్యేక ఉద్యమాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఇదే జరిగింది. మరోవైపున మనం చెబుతున్న అవినీతి కి వ్యతిరేకంగా మోదీ మాట్లాడడంతో దానిలో లోతు ఎంత ఉంది..అనే దానికంటే ఎక్కువ మంది ఆ వైపు ఆకర్షితులయ్యారు. సంస్కరణలకు ఇప్పట్లో అవకాశం లేదు. 2005లో దామాషా ఎన్నికల పద్ధతి దాదాపు వచ్చే అవకాశం ఉంది. అయితే ఆ రోజు నాయకత్వంలో ఉన్న వారు సరైన అడుగులు వేయకపోవడంతో సాధ్యం కాలేదు. ఈ రోజు మోదీగారిని అడిగితే అంతా నేను గెలుస్తుంటే ఎన్నికల వ్యవస్థ మార్చమంటున్నాడేంటి..నాకు నష్టం వస్తుంది కదా..అని అడ్డుకుంటారు. ఎవరైనా అంతే మీరు అధికారంలో ఉన్నా కూడా మీ మనసు అలానే పోతోంది. కాబట్టి వాటిమీద కంటే ప్రజలకు అందే విద్య, ఆరోగ్యం వంటి ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న..మన ఎజెండాకు పూర్తిగా అనువైన అంశాలతో కొత్త రీతి ఉద్యమాన్ని నిర్మించాలి. ప్రాథమిక లక్ష్యాలు అవే. తిరంగా కాదు ప్రజాస్వామ్యం అంటే..భరతమాత కాదు..నాలుగు సింహాల చిహ్నం కాదు.ప్రజలు.. వాళ్ల జీవితాలు. వాళ్ల జీవితాలకు సంబంధించింది..పాలనకు సంబంధించిన అంశాలను అన్వయం చేసి ఆచరణ రీతిలో పరిష్కారాలను చూపిస్తూ వీటికోసం పోరాడుతున్న వారిని కలుపుకుని ఒక ఉద్యమాన్ని నిర్మిస్తూ భవిష్యత్ తరాన్ని తయారు చేయాలి. వారికి ఆ లోతు కావాలి, విశ్వసనీయత, ధైర్యం కావాలి..తాత్కాలిక రాజకీయాలు, ఆలోచనలను పక్కన పెట్టి దీర్ఘకాలిక దృష్టి కావాలి. ప్రస్తుతం ఆ పనిలో ఉన్నాం. కచ్చితంగా రానున్న 25 ఏళ్ల లోపు ఆ ఉద్యమం మరింత పెరుగుతుంది. దేశంలో మార్పుకి దోహదం చేస్తుంది.

**ప్రశ్న : మీ ఆలోచనా విధానం, పరిజ్ఞానాన్ని చాలా సందర్భాల్లో వివిధ రూపాల్లో తెలియపరిచారు. మీ ఆలోచనా దృక్పథం, ఇలా నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ఎలా?**

**జేపీ:** ఇది కొన్నేళ్లపాటు సాగాలి. సాహిత్యాన్ని నిరంతరం అధ్యయనం చేయాలి. రోజువారీగా జరుగుతున్న రాజకీయాన్ని మనదైన రీతిలో, మౌలికమైన అంశాల గురించి హేతుబద్ధ విధానం, వాస్తవాల ఆధారంగా మదింపు ప్రతిరోజూ జరగాలి..ఒక పుస్తకం కూడా రాయాలి. ఆ విషయంలో ప్రజలకు నేను సంజాయిషీ చెప్పాలి. చాలా కాలం నుంచి రాద్దామనుకుంటున్నా..మనసులో అంతా ఉన్నా ఒక పుస్తకం రాయాలంటే అది ఫర్‌ఫెక్ట్‌గా ఉండాలి. అయితే నాకు తెలుసు ఫర్‌ఫెక్ట్‌గా ఏదీ ఉండదు. అసాధ్యమైన అద్భుతం..సుసాధ్యమైన మంచికి శత్రువు..అని నేను ఎప్పుడూ చెబుతూ ఉంటాను. అయినా కూడా మనం రాస్తే దానిలో పొరపాట్లు ఉండకూడదనే భావనతో కొంచెం ఆలస్యం అవుతోంది. కచ్చితంగా కొద్ది కాలంలోనే అది పూర్తి చేయాలి. కనీసం చదివే ఓపిక ఉన్న వాళ్లకి మనదేశ పరిస్థితుల పట్ల, ప్రజాస్వామ్యాన్ని గురించి సమగ్రమైన అవగాహన వచ్చేలా ఒక మార్గం. కాబట్టి వివిధ రూపాల్లో ఈ ప్రయత్నం జరగాలి. ఏ ఒక్కటీ చాలదు.

**ప్రశ్న: జనశిక్షణ పేరుతో వివిధ అంశాలపై అవగాహన కల్పించి, దాని ఆధారంగా స్థానికంగా వాళ్లు ఒక కార్యక్రమం నిర్వహించేలా చేశారు. అది జరిగి 25 ఏళ్లవుతోంది. కొత్త తరం వచ్చింది..అనేక మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయి..అలాంటి ప్రయత్నం ఏమైనా ఉందా?**

**జేపీ:** ఒక ప్రయత్నం జరుగుతోంది. నగరంలో వికేంద్రీకరణ వంటి ఐదారు అంశాలను గుర్తించాం. పూర్వం మౌలికమైన అంశాల మీద దృష్టి పెట్టాం ఇప్పుడు పెద్దగా దాని మీద దృష్టి పెట్టకుండా కార్యాచరణ మీద దృష్టి పెట్టి విద్య, వైద్యం, పట్టణాలు-నగరాల్లో అధికార వికేంద్రీకరణ, చట్టబద్ధపాలనలో కనీసం ఒకటి రెండు అంశాలు వంటి వెంటనే ప్రజలకు అర్థం అయ్యి ఎంతో కొంత లోకల్ యాక్టివిటీ జనరేట్ చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.. 1996 నుంచి 2006 దాకా పదేళ్ల పాటు మనం చాలా బలంగా చేశాము. ఉదాహరణకు స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం పార్టీకతీతంగా సర్పంచులందర్నీ కలిపాం. ఎన్నికైన స్థానిక ప్రభుత్వాలతో కూర్చున్నాం. కోటీ ఎనిమిది లక్షల సంతకాలను సేకరించారు. దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదు. లోక్‌నాయక్ జేపీ ఆనాడు దేశ వ్యాప్తంగా ఉద్యమం చేసినా కూడా నిజాయితీగా అన్ని సంతకాలు రాలేదు. ఒక అద్భుతమైన ప్రక్రియ జరిగింది. ప్రక్రియలో కానీ ప్రయత్నంలో కానీ ఏమాత్రం లోపం లేదు. అంతకంటే చేయడం మానవమాత్రులకు ఏమాత్రం సాధ్యం కాదు. అయితే ఆరోజు మనం చేసిన ప్రక్రియ మన మనస్సుల్లో నిలిచింది కానీ ఫలితం రాలేదు. వీళ్లెవరూ అధికార వికేంద్రీకరణకు ముందుకు రాలేదు. అందరూ మన దగ్గర నమ్మబలికారు. ఆచరణలో నిజంగా ఫలితాలు చూపించే అంశాలను మనం చేపట్టాలి. లేకపోతే ఎంతో గొప్ప ఉద్యమం చేశామని తృప్తి పడితే ఫలితం లేదు. నేను ఎప్పుడూ కూడా ఓ వ్యాపారిలాంటి వాడ్ని. ఫలితం ఏం వచ్చింది..చివరకు ప్రజల జీవితాల్లో ఏం మార్పు వచ్చింది. అది రాకపోతే మీరు ఎంత గొప్ప ఉద్యమం చేసినా నాకు అనవసరం.

**ప్రశ్న : పెద్దగా త్యాగాలు అవసరం లేదు.. భయాన్ని, భేషజాన్ని త్యాగం చేయండని మీరు ఎక్కువగా చెప్పేవారు. రాజకీయం పవిత్ర వ్యాసంగం అన్నారు. అయితే అందరికంటే ఎక్కువ త్యాగం మీరు చేశారు. ఇలా కొద్ది మంది అయినా త్యాగాలు చేయకుండా మీరు చెబుతున్న మార్పులు ఎలా సాధ్యం ? మీరు చెబుతున్న దానికి, చేసిన దానికి వైరుధ్యం కనిపిస్తోంది?**

జేపీ: నేనెలా అనుకోవడం లేదు. ఎందుకంటే వ్యాపారిలా ఆలోచిస్తానని ఇందాకే చెప్పాను. మీ జీవితం కానీ నా జీవితం కానీ ఇంత సమయం, ఇంత శక్తి, ఇంత నైపుణ్యం, ఇంత విశ్వసనీయత ఉన్నాయి. దాన్నుంచి అత్యధిక ఫలితాలు ఎలా వస్తాయి. డబ్బుతోనే లెక్క కట్టక్కలేదు. నిజంగా మీకు సొంత జీవితంలో సంపాదన కంటే అత్యుత్తమ ఫలితాలు ఊరికే మీ తృప్తో, ఎమోషనో కాదు..ఫలితాలు వచ్చేటట్టయితే కచ్చితంగా ఆ సమయాన్ని కేటాయించాలి. నా జీవితంలో బహుశా నా కుటుంబం కోసం మాత్రమే పనిచేసినట్టయితే చాలా సంపాదించే అవకాశం వచ్చి ఉండేది. అంతకంటే ఏం జరుగుతుంది. అంతేకదా? ఆ సున్నాలు లెక్క పెట్టుకోవడమే కదా? కానీ అంతకు వెయ్యి రెట్లు ఈ సమాజంలో మార్పుకి దోహదం చేసి ఉంటాం. అనుకున్న ఫలితాలన్నీ రాలేదు. లక్ష కోట్ల రూపాయలు ఒక్క పెట్రోలు బంకుల కార్యక్రమం వల్లే ఆదా అవుతోంది. అయితే చాలా విషయాలు రూపాయల్లో లెక్క కట్టలేం. రుబెల్లా వ్యాక్సిన్ అందరికీ అందాలని చెబితే ఏడాదికి రెండు లక్షల మంది వికలత్వాన్ని తప్పించుకోగలుతున్నారు. ఎన్ని కోట్ల రూపాయలతో మీరు రెండు లక్షల మందిని కాపాడతారు. కాబట్టి నేను ఆ అంచనా వేసుకుని నిర్ణయం తీసుకున్నాను కానీ త్యాగం అనుకోవడం లేదు. నా నోటి నుంచి ఎప్పుడూ ఆ మాట రాలేదు. ఈ 26 ఏళ్ల జీవితంలో త్యాగం అనే మాట నా నుంచి రాలేదు. చర్చలో త్యాగం అనే పదం వాడడం తప్ప అది నేను ఇప్పటికీ నమ్మడం లేదు. దేశం కోసం పెట్టుబడి అవసరం. మంచికో చెడుకో నేను నమ్మేది ఏంటంటే నాకు ఈ సమాజం కొంత అవకాశాన్ని, అవగాహనను ఇచ్చింది. దాన్ని ఈ రూపంలో వినియోగిస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని. ఎందుకని నేను త్యాగం అనే మాట తీసుకురాలేదంటే..మనదేశంలో మహాత్మాగాంధీ మన అందరికీ గొప్ప ఆదర్శం. మనజాతి జీవనాడిని, మన ఆలోచన్ని చాలా మేరకు ప్రభావితం చేసిన మనిషి మహాత్మాగాంధీ. భారతదేశ చరిత్రలో కానీ, ప్రపంచ చరిత్రలో కానీ అత్యున్నత స్థాయిలో ఉన్న మహనీయుడు ఆయన. మనదేశ చరిత్రలో అశోకుడు, బుద్ధుడు, అక్బర్ ఈ ముగ్గుర్ని మనం మహాత్మాగాంధీ స్థాయిలో పెట్టొచ్చు. ప్రపంచ చరిత్రలో గత వెయ్యేళ్లలో ఏరకంగా చూసినా టాప్ ఐదుగురు, పదిమందిలో మహాత్మాగాంధీ ఉంటారు. చాలా గొప్ప వ్యక్తిత్వం ఆయనది. ఆయన రుషి. ఆయన అనుకోకుండా మన మనస్సులో ఏం భావం కలిగించారంటే సమాజం కోసం ఏమన్నా చేయాలంటే నీకోసం అన్నీ త్యాగం చేసేసుకో..నీ



కుటుంబం, నీ వ్యక్తిగతమైన సుఖాలు, నీ ఆదాయము, నీ సంపాదన ఇవేమీ వద్దు, అన్నీ వదిలేసుకోండి. ఆయన నిజంగానే దేశానికి స్వాతంత్య్రం వస్తే దాని కోసం అందర్నీ కలిపి పోరాడిన వ్యక్తి అయినా ఆ రోజు ఢిల్లీలో లేరు. ఆయన కనీసం మువ్వన్నెల జెండా పట్టుకోలేదు. కలకత్తాలో ఆయన కన్నీళ్లు కారుస్తూ కూర్చున్నారు. ఇదా స్వాతంత్య్రం అంటే అని. అంతకంటే ఉదాత్తత ఇంక ఎక్కడ ఉంటుంది. వేరే మతం వాళ్లకు అన్యాయం జరుగుతుందని చెప్పి నిరాహార దీక్ష చేస్తే చివరకు ఆయన మతం వాళ్లే పొట్టన పెట్టుకున్నారు. ఇంతకంటే త్యాగనిరతి ఎక్కడ ఉంటుంది. దాన్ని చూసి మన దేశంలో ఏం భావన కలుగుతుందంటే చాలా మందికి దేశంలో నిజమైన న్యాయం చేయాలంటే వ్యక్తిగా అన్నీ వదిలేసుకోవాలని చెప్పి. అది సాధ్యం అయ్యే పనికాదు. అది అవసరమూ కాదు. దీని వలన నిజానికి ఏం అవుతుందంటే.. ఇది మనం చేయలేం కావున వదిలేద్దాం. దేశాన్ని మనం ఏం చేయలేం. మన పని మనం చూసుకుందాం..అనే ఆలోచనకు వస్తున్నారు. అదికాదు నా జీవితం. నాకు కుటుంబం అవసరం. దానికి సిగ్గు పడాల్సిన అవసరం లేదు. కానీ చుట్టూ ఉన్న పరిస్థితులు కూడా మార్చడం నాకు, నా కుటుంబానికి కూడా అవసరం. కాబట్టి దానికోసం కొంత సమయాన్ని కేటాయిస్తాను. ఒక ప్రాక్టికల్ పేట్రియాటిజమ్ కావాలనే భావన ఒకటి అర్థం కావాలి. రెండోది..మన దేశంలో ఎమోషన్స్ ఎక్కువ. ఈ మాట నేను ఎప్పుడూ చెప్పలేదు. మనం చాలా వేగంగా స్పందిస్తాం. నా దగ్గరకి కనీసం కొన్ని వేల మంది గత 25 ఏళ్లలో వచ్చి సార్..మీరు చెప్పండి అన్ని వదిలేస్తాం సార్ అనేవారు. అందర్నీ కోప్పడేవాడ్ని. నెల రోజుల్లో దేశంలో అన్ని మార్పులు వచ్చేస్తాయంటే మనం అందరం అన్ని త్యాగాలు చేయొచ్చు..కానీ అలాంటిది కాదు ఇది. ఒక పార్టీని దించడం కాదు..ఓ వ్యక్తిని వెళ్లగొట్టడం కాదు సమస్య. ఈ దేశ చరిత్రను పునర్లిఖించడం..మన మనస్సుల్లో విప్లవం రావాలి. వ్యవస్థ రూపంలో అది ప్రస్ఫుటం కావాలి. ఇలా జరిగితే ఒప్పుకుంటాను. అలా కాదని తెలిసినప్పుడు నా ప్రతిష్ట పెరగడానికి సేవకులు దొరకాలని వాళ్లందర్నీ త్యాగాలు చేయండని అనడం కంటే అన్యాయం ఉంటుందా? నేను దాన్ని భరించలేను. అందుకే ఆనాడు..ఈనాడు కూడా కోప్పడతాను. నీకున్న శక్తిని, సమయాన్ని ఎలా కేటాయించాలో అడుగు. నీకున్న శక్తి, అనుభవం, ఆసక్తిని బట్టి ఒక మార్గం చూపించే ప్రయత్నం చేస్తాను. అప్పటికీ ఇప్పటికీ నేను నమ్ముతోంది అదే. ప్రపంచంలో పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో త్యాగాల గురించి ఎవరూ మాట్లాడరు. అబ్రహం లింకన్ త్యాగాల గురించి మాట్లాడలేదు. బీద కుటుంబం నుంచి వచ్చినా కూడా లా ప్రాక్టీసు చేసుకున్నారు. ఆయన కుటుంబాన్ని ఆయన చూసుకున్నారు. ఆయనకు చేతనైంది దేశం కోసం చేశారు. చర్చిల్ ఎప్పుడూ త్యాగం గురించి మాట్లాడలేదు. మన మీద జాత్యాహంకారాన్ని చూపించినా అద్భుతమైన నాయకత్వాన్ని తన దేశానికి ఇచ్చాడు. కాబట్టి మనం ఈ ఎమోషన్ నుంచి కొంచెం హేతుబద్ధంగా ఆలోచించి సమాజ హితం, వ్యక్తి సుఖము రెండింటిని సంధానించడం. ఒకటి ఇంకోదానికి వ్యతిరేకం కాజాలదు. ఎలాగూ రాజీనామా చేస్తున్నావు కదా మహాత్మాగాంధీని అనుసరించు, గాంధీలా అయిపో, అన్నీ వదిలేసేయ్ అంటే..నేను అది నమ్మడం లేదు. అది చేయడం నాకు చాలా తేలిక..దాని వల్ల నేను ఓ ఇమేజ్ ను సృష్టించుకోవచ్చు. కానీ దాని వల్ల సమాజానికి మేలు ఏం జరగదు. నా కీర్తి కోసం సమాజానికి మేలు జరగనిది నాకు అనవసరం అని నిర్ణయం తీసుకున్నాను. కాకతాళీయంగా కాదు. అప్పటికీ ఇప్పటికీ నేను నమ్మేది.. అది మార్గం కాదు. కానీ అందంగా కనిపిస్తుంది. కానీ సమాజం మారదు.

**ప్రశ్న: సమాజం కోసం మౌలికమైన మార్పుల కోసం కొంచెం కూడా ఎమోషనల్ కాంపోనెంట్ లేకపోతే చాలా నిస్సారంగా ఉంటుంది కదా?**

**జేపీ :** భావోద్వేగాలు అవసరమే అయితే ఎలాంటివి కావాలి. రువాండ, బురిండిలో రెండు తెగల మధ్య భీకర పోరాటం జరిగింది. లక్షలమంది విక్టోరియా సరస్సులో శవాలుగా తేలారు. ఇదంతా ఎమోషన్ నుంచి వచ్చిందే. మతాల మధ్య విద్వేషాలు ఎమోషన్ నుంచి వచ్చిందే ..ఎమోషన్‌లు రకరకాలుగా ఉంటాయి. మనకు ఎలాంటి ఎమోషన్ అవసరం అనేది ముఖ్యం. నాకు నా ఊళ్లో ఆ స్కూల్‌లో ఎలాంటి అవకాశాలు లభించాయో ..అలాంటి అవకాశాలు ప్రతి బిడ్డకు లభించాలనే తీవ్రమైన ఉద్విగ్న భావన ఉంది. అది సరైన ఎమోషన్. తాత్కాలికంగా చల్లారిపోయే ఎమోషన్ కాదది. ఒక నిర్మాణాత్మకమైంది. రుబెల్లా టీకా కోసం పోరాడి సాధించం..వికలాంగులు కాకుండా ఆపగలిగామనే సంతృప్తి ఉంది. కాబట్టి నిజమైన ఉద్వేగం లేకపోతే నిజాయితీగా పనిచేయలేరు. తాత్కాలికంగా డ్రామాలు ఆడొచ్చు..ఏదో కొంత కీర్తిని ఆశించొచ్చు..పదవులను పొందొచ్చు..డబ్బులు సంపాదించొచ్చు. కానీ దీర్ఘకాలం సాధ్యం కాదు. కాబట్టి లోక్‌సత్తా ఉద్యమంలో పాల్గొన్నవాళ్లు కానీ, ప్రజాహితం కోసం పనిచేస్తున్న చాలా మందిలో కచ్చితంగా ఎమోషన్ దాగి ఉంది. అది నిర్మాణాత్మకమైందా.. విద్వేషపూరితమైందా? ప్రజలను కలిపేదా? వేరు చేసేదా? అనేది చూడాలి. నిజమైన ఎమోషన్



కావాలంటాను. మహాత్మాగాంధీ రోజూ అదే పనిగా భావావేశాన్ని ప్రకటించలేదు. మనస్సులో దేశ ప్రజలపట్ల అనురక్తి లేకపోతే, ఎంత ఆర్తి లేకపోతే ఏమీ ఆశించకుండా ఎందుకు అంత కష్టపడతారు. స్వతంత్ర్యం వచ్చిన తర్వాత జెండా దగ్గర కూడా నుంచోకుండా. కానీ ఎమోషన్‌ను మాటల్లో ప్రదర్శించారా? చాలా నింపాదిగా మాట్లాడారు. తనదైన రీతిలో ప్రజల్లో ఆలోచన పెంచే ప్రయత్నం చేశారు. కాబట్టి ఎమోషన్ లేకుండా ఒక మనిషి జీవిత పర్యంతం మంది కోసం పనిచేయడం అసాధ్యం. హిట్లర్‌కు బోల్డంత ఎమోషన్ ఉంది. ఆ ఎమోషన్ ఆ దేశాన్ని , ప్రపంచాన్ని సర్వనాశనం చేసింది. కాబట్టి ఆ ఎమోషన్ దేశాన్ని బాగు చేసేదా? నాశనం చేసేదా? మార్గాన్ని చూపేదా..అనేది ముఖ్యం.

**ప్రశ్న: లోక్‌సత్తా ఉద్యమం కంటే ముందే ప్రజాస్వామ్య పీఠాన్ని ఏర్పాటు చేశారు. అనేక మౌలిక సంస్కరణలు ఇక్కడ చేసిన పరిశోధన ఉపయోగపడింది. మార్పులో ఎఫ్‌డీఆర్ రోల్ ఏంటి?**

**జేపీ:** ఎఫ్‌డీఆర్ బోర్డు మెంబర్‌లు అద్భుతమైన వాళ్లు, కానీ సమాజంలో ప్రతిష్ట కోసం ఏనాడు పాకులాడలేదు. మంచిపని జరుగుతోంది. ఈ దేశానికి ఇది అవసరం. చిత్తశుద్ధితో పార్టీలకు అతీతంగా హేతుబద్ధతతో చేస్తున్నారు..మనం చేతనైనంత సాయం చేద్దామనే ఆలోచనే ఉన్న వారు. మామూలుగా సంస్థల్లో ఉండే గిల్లికజ్జాలు, ఆధిపత్యాలు వంటి వాతావరణం పొరపాటున కూడా లేదు. అలాంటి సంస్థ లేకపోతే ఏమౌతుందంటే– లోక్‌సత్తా ఉద్యమం ఒక ప్రజాస్వామ్య ఉద్యమం. లక్షలాదిమంది చేరతారు. లక్షలమంది చేరినప్పుడు నడుపుకునే హక్కు ఉంటుంది. మనందరం ఓ మార్గం చూపినా నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంటుంది. దారి మారకుండా ఉండాలి...లక్ష్యం మారకుండా ఉండాలి..అంటే సుస్థిరంగా ఉండే సంస్థ కావాలి. ఒక చుక్కాని కావాలి. ఆ చుక్కాని లేకపోతే ఆ పడవ ఇష్టం వచ్చినట్టు వెళ్లిపోతోంది. చుక్కానే ప్రజాస్వామ్య పీఠం. ప్రజల్లోకి సమాచారం ఇవ్వడం లేదా ఉద్యమంగా లోక్‌సత్తా ఉంటుంది. రాజకీయంగా వెళ్లాలనుకున్నప్పుడు పార్టీ. ఇవన్నీ కూడా కొన్ని వేదికలు. కానీ మొత్తానికి మూలం..ఈ దేశానికి ఏ మార్పు కావాలి..ఎందుకు కావాలి.. దానికి హేతుబద్ధమైన పరిష్కారాలు వాస్తవాల ఆధారంగా తీసుకురావాలి. ప్రజలు ఆమోదించగలగాలి. ఊరికే నా బుర్రలో బుద్ధి పుట్టింది..అర్ధరాత్రి దేవుడు కల్లోకొచ్చాడని నేను చెప్పానంటే అది మూర్ఖత్వం అవుతుంది. అందుకే ఏనాడు మనం ఏం మాట్లాడినా కూడా ఆధారాలు ఇస్తున్నాం. తర్కం చూపెడుతున్నాం. కాలక్రమేణా మనం చెప్పేదే నిజమని రుజువు అవుతుంది. మనది పొరపాటు అనుకుంటే సరిదిద్దుకుంటాం. కాబట్టి ప్రజాస్వామ్య పీఠం కీర్తి కోసం పాకులాడలేదు. రాజకీయ వ్యవస్థ ఎక్కడైనా కూడా చాలా అసూయాగ్రస్తమైన వ్యవస్థ. మీకు కీర్తి వస్తుందంటే వెంటనే వాళ్లు ఆపేస్తారు. వాళ్లకే కీర్తి ఇచ్చి ఈ ఫలితం కావాలండి మీరు చేయండి..మీకు మంచిది..దేశానికి మంచిది అంటే వాళ్లు సంతోషంగా మాట్లాడకుండా కూర్చుంటారు. కొన్ని సందర్భాల్లో నేను ఏం జరిగిందో చెబుతుంటాను.. అది ఆత్మవిశ్వాసం కోసం. ఇది జరిగాయి..జరుగుతుంది..పెద్ద అసాధ్యం ఏం కాదు.. మన దేశంలో అంత అధ్వానంగా ఏం లేదు.. కొన్ని బాగు చేయగలిగాం అని నమ్మకం కోసం చెప్పడం తప్పితే కీర్తి కోసం కాదు. కీర్తి కోసం ఎప్పుడైతే ప్రయత్నం చేస్తామో అప్పుడు నష్టం ఎక్కువ జరుగుతుంది. స్వయం పోషక నాయకత్వం, ధైర్యం, వ్యూహ చతురత, ఆటుపోట్లను తట్టకుని నిబ్బరంగా నిలబడే శక్తి ఇవన్నీ ఉన్న వాళ్లను తయారు చేసే పనిలో ఉన్నాను. గతంలో ఆ పని పెద్దగా చేయలేదు. దీర్ఘకాలం నాయకత్వాన్ని ఇచ్చే ఓ బృందాన్ని తయారు చేస్తున్నాం.. ఆ పని ఇప్పుడే మొదలు పెట్టాం. కొన్నేళ్లు పడుతుంది. కచ్చితంగా బలమైన నాయకత్వం వస్తుంది. ఈ దేశం మారాలని కోరుకునే వాళ్లంతా కలిసి వస్తున్నారు.

(ఇంకా ఉంది...)




## ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు @

# youtube.com/JP Loksatta

స్వతంత్ర భారతం 75 - లోక్‌సత్తా 25 కలిసి వచ్చిన అపురూప సందర్భంలో భవిష్యత్ భారత కార్యాచరణపై ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో..

1) సామాజిక, రాజకీయ విశ్లేషకురాలు, యువ జర్నో స్వాతి ఇంటర్వ్యూ :
   ఎన్నికల్లో ముక్కుమూసుకుని ఓట్లు వేయటం, ఎవర్ని గెలిపించినా ఏమున్నది గర్వకారణం అని నిట్టూర్చటం, మార్పు కోసం ఏదైనా చేయగల సత్తా ఉన్న యువత రోజువారీ జీవితంలోనే అలసిపోతుండటం.. ఏమిటి చేయటం?.. ఇంకా పలు ప్రశ్నలు.
2) లైఫ్‌లో ఇంతవరకూ ఎవరినీ ఇంటర్వ్యూ చేయని సామాజిక, పాలనా అంశాల ఉద్యమకారులు, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి ఎక్స్‌క్లూజివ్ :
   రాజకీయాల్లోకి వస్తే చెప్పుతో కొట్టండి.. అన్న వారిని అధికారంలోకి తేవటం తప్ప లోక్‌పాల్ ఉద్యమం సాధించింది ఏమిటి? దేశంలో అవినీతి ఎందుకు అంతం కావటం లేదు?.. & మోర్.
3) సామాజిక, రాజకీయ ఉద్యమకారులు, మీడియా విశ్లేషకులు కటారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూ:
   మోదీ, కేసీఆర్, జగన్‌ల బాకాలే తప్ప ఉద్యమకారులు, పౌర సమాజం గొంతు ఈవేళ బలంగా ఎందుకు వినిపించటం లేదు? ఏవి ఉచితాలు, ఏవి అనుచితాలు.. సంక్షేమం అంటే ఏమిటి?.. ఇంకా అనేక అంశాలు (రెండు భాగాలు).
4) విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర ఎక్స్‌క్లూజివ్:
   ట్యాక్స్ ఎగ్గొడితే అది నల్లడబ్బు. మరి సరిగా సేవలు అందించని ప్రభుత్వాలకు పన్ను సరిగా కట్టనక్కర్లేదనుకునే పౌరులు కూడా బ్లాక్‌మనీగాళ్లే అవుతారా? ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఎలా ఉండాలి?.. & మోర్ (రెండు భాగాలు).
5) పబ్లిక్ పాలసీ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ (ఇందులో జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు):
   మోదీ ఈడీని ప్రయోగిస్తున్నాడని ఆరోపిస్తున్నారు గానీ.. ఒక్క పార్టీ కూడా చట్టబద్ధపాలనని సంస్కరించాలని ఎందుకు డిమాండ్ చేయటం లేదు? డ్రగ్స్‌ని నిషేధించినా ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?.. ఇంకా పలు ప్రశ్నలు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th January, 2023 Posting Date 15 &16th of every month

# 2023 - నూతన సంవత్సర,

# జాతీయ యువజన దినోత్సవ (జనవరి 12) శుభాకాంక్షలు



పుట్టిన పుట్టుక బిడ్డ భవిష్యత్తును శాసించటం, నివారించదగ్గ బాధలు కొనసాగటం అనే రెండు పాపాలకూ భారతదేశం శతాబ్దాల నుంచి కాణాచి. వీటిపై పోరాటానికి స్వామి వివేకానంద మనల్ని మేలుకొలిపారు, మనకు ఆత్మవిశ్వాసాన్నిచ్చారు. అయితే ఆ రెంటి నుంచీ పూర్తి విముక్తిని సాధించటానికి, వివేకానంద, ఇంకా ఎందరో మహనీయుల ఆశయాల్ని సాధించటానికి చరిత్రలోనే మొట్టమొదటిసారిగా నేటి తరానికి అవకాశాలు లభించాయి. జాతీయ విద్యావిధానాన్ని సక్రమంగా అమలు చేస్తే, తలకిందులుగా ఉన్న ఆరోగ్య వ్యవస్థను సరిచేస్తే, చట్టం అందరికీ సమానంగా వర్తించేలా సంస్కరిస్తే, అందరికీ ఉపాధి అవకాశాలకు నైపుణ్యాల్ని, మౌలిక వసతుల్ని అందిస్తే, వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ చిన్న పట్టణాల అభివృద్ధితో గ్రామాలు-నగరాల మధ్య అంతరాల్ని తగ్గిస్తే, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిస్తే, ఎన్నికల వ్యవస్థను, పార్టీల్ని సంస్కరిస్తే, అప్పు చేసి పప్పుకూడు లేకుండా ఉచితాలకు-అభివృద్ధికి మధ్య సమతూకం పాటిస్తే, వచ్చే పాతికేళ్లూ మన మాటలు, చేతలు ఈ అంశాల చుట్టూనే సంఘటితంగా, తదేకంగా తిరిగితే.. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, సాంకేతికతల సహకారంతో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు లభిస్తాయి, నివారించదగ్గ బాధలు తొలగుతాయి, భారత్ అభివృద్ధి చెందిన దేశమవుతుంది.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**